శ్రీశైలం భద్రమేనా?



శ్రీశైలం డ్యాంకు 2009లో భారీగా చేరిన వరద (ఫైల్)

సాగు నీటి ప్రాజెక్టులు పది కాలాలు మెట్ట పొలాలను తడిపి కష్టజీవుల సేవలో తరించాలంటే వాటిని 'జాతీయ సంపద'గా గుర్తించి కాపాడుకోవాలి. బహుళార్ధ సాధక ప్రాజెక్టుగా కర్నూలు జిల్లాలో కృష్ణా నదిపై 'శ్రీశైలం ప్రాజెక్టు'ను నిర్మించారు. తెలుగు రాష్ట్రాల జీవనాడి.. రాయలసీమ కరువు రైతుల ప్రాణాధారం ఈ ప్రాజెక్టు. 2009లో 25.5 లక్షల క్యూసెక్కులకు పైగా వరద చేరి డ్యాం పైనుంచి ప్రవహించడంతో ప్రాజెక్టు భద్రత, నిర్వహణ లోపాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. 2014 సెప్టెంబరు 23న దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ సమీక్ష నిర్వహించింది. అధ్యయనానికి ఆనాటి ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) ఎం. వెంకటేశ్వరరావు అధ్యక్షతన 8 మంది నిపుణులతో కమిటీ ఏర్పాటైంది. నాటి నుంచి డ్యాం భద్రతపై పలు నిపుణుల కమిటీలు అధ్యయనం చేయడం.. పలు సూచనలతో నివేదికలు ఇవ్వడం పరిపాటిగా మారింది. తీసుకున్న చర్యలు మాత్రం శూన్యమనే చెప్పాలి. డ్రిప్-2 కింద రూ.139 కోట్లు నిధులు మంజూరు చేయమని ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపితే ప్రపంచ బ్యాంక్ కొర్రీలు పెట్టి వెనక్కి పంపిందే తప్ప నిధులు ఇవ్వలేదు. ఫ్లంజ్‌పూల్, భద్రత, నిర్వహణ సమస్యలు వెంటాడుతున్నా.. తక్షణ చర్యలపై పాలకుల్లో చిత్తశుద్ధి కనిపించడం లేదు. గురువారం నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) బృందం డ్యాం భద్రతపై క్షేత్రస్థాయిలో పరిశీలించింది.

కర్నూలు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి):

- 2009లో డ్యాంకు చేరిన 25.5 లక్షల వరద.. డ్యాంపై ప్రవాహం
- 2014 సెప్టెంబరు 23న డ్యాం భద్రతపై ఢిల్లీలో సమీక్ష
- నాటి నుంచి ప్రాజెక్టు భద్రతపై పలు కమిటీల అధ్యయనం
- డ్రిప్-2 కింద రూ.139 కోట్లు ఇవ్వాలని కేంద్రానికి ప్రతిపాదన
- తాజాగా శ్రీశైలం ప్రాజెక్టును పరిశీలించిన నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) బృందం

ఉమ్మడి రాష్ట్రంలో శ్రీశైలం దేవస్థానం దగ్గర కృష్ణా నదిపై 1963 జూలై 24న 'శ్రీశైలం ప్రాజెక్టు' నిర్మాణానికి అప్పటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ పునాది రాయి వేశారు. కుడి గట్టు విద్యుత్తు కేంద్రం (రైట్ పవర్ హౌస్) సహా ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావడానికి 20 ఏళ్లు పట్టింది. డ్యాం గరిష్ట నీటి మట్టం 885 అడుగులు. గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 308.04 టీఎంసీలు. వరద ప్రవాహ సామర్థ్యం (ఫ్లడ్ వాటర్ డిశ్చార్జ్ కెపాసిటీ) 13.20 లక్షల క్యూసెక్కులు. డ్యాంలోకి ఏటేటా పూడిక చేరడంతో.. 2011లో వరద లెక్కలు పరిశీలించి గరిష్ట నీటినిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలుగా నిర్ధారించారు. అంటే 92.24 టీఎంసీలు పూడిక చేరింది. 12 రేడియల్ క్రస్ట్ గేట్లు స్పిల్‌వే నుంచి వరద జలాలు కిందకు పడి.. మళ్లీ పైకెగిరి నదిలో పడే ఫ్లంజ్‌పూల్ ప్రాంతంలో భారీగా గుంత ఏర్పడింది. 2009 అక్టోబరులో డ్యాంకు 25.5 లక్షల క్యూసెక్కుల వరద చేరడంతో ఫ్లంజ్‌పూల్ గుంత వల్ల డ్యాం భద్రతకు ఎలాంటి ముప్పు పొంచి ఉంది..? 2009 నాటి వరదలు మళ్లీ వస్తే డ్యాం తట్టుకోగలదా..! నాటి వరదకు డ్యాం ఆనకట్ట సహా కుడి, ఎడమ గట్లు ఏమేరకు దెబ్బతిన్నాయి..? వంటి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 2014 సెప్టెంబరు 23న ఢిల్లీలో కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ శ్రీశైలం సహా వివిధ ప్రధాన ప్రాజెక్టుల భద్రతా, నిర్వహణ లోపాలపై సమీక్షించింది.

సర్వేలు, అధ్యయనాలతో కాలయాపన

ఢిల్లీలో 2014 సెప్టెంబరు 23న జరిగిన ప్రాజెక్టు సమీక్షలో శ్రీశైలం ప్రాజెక్టు భద్రత, నిర్వహణ లోపాలపై అధ్యయనానికి ఆనాటి ఏపీ జలవనరుల శాఖ ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు చైర్మన్, కన్వీనర్, మెంబరు కర్నూలు ప్రాజెక్ట్స్ సీఈ విశ్వేశ్వరరావు, సీడబ్ల్యూసీ హైడ్రాలజీ విభాగం డైరెక్టర్ భూపాల్‌సింగ్, ప్రాజెక్టు డిజైన్ డైరెక్టర్ ఎస్‌కే సిబాల్, ఫౌండేషన్ ఇంజనీరింగ్ డైరెక్టర్ వీఆర్‌కే పిళ్లై, సెంట్రల్ డిజైనింగ్ ఆర్గనైజేషన్ (సీడీఓ) సీఈ గిరిధర్‌రెడ్డి, రిటైర్డ్ సీఈ కేవీ సుబ్బారావు, తెలంగాణ క్వాలిటీ కంట్రోల్ సీఈ ఎం.కృష్ణారావులను సభ్యులుగా నియమించిన కమిటీ అదే ఏడాది అక్టోబరు 28న ప్రాజెక్టును పరిశీలించి డ్యాం భద్రత కోసం పలు సూచనల చేస్తూ నివేదిక ఇచ్చింది. 2017 జూలై 13న కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్ డాక్టర్ వైకే మూర్తి నేతృత్వంలోని నిపుణుల కమిటీ, 2018 జూన్ 11, 12న జలవనరుల శాఖ రిటైర్డ్ ఈఎన్‌సీ పి.రామరాజు, రిటైర్డ్ సీఈ కె.సత్యనారాయణ, రిటైర్డ్ ఈఈ కె.కృష్ణ నిపుణుల కమిటీ ఈ ప్రాజెక్టును పరిశీలించి డ్యాం భద్రత, ఫ్లంజ్‌పూల్ మరమ్మతులకు పలు సూచనలు చేస్తూ మరో నివేదిక ఇచ్చారు. 2020 ఫిబ్రవరి 25న కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్, డ్యాం భద్రతా నిపుణులు ఏబీ పాండ్యా చైర్మన్‌గా పది మంది సభ్యులతో కేంద్ర నిపుణుల కమిటీ డ్యాంను పరిశీలించి.. నివేదికలను స్టడీ చేసి 2021లో కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ)కు అధ్యయన రిపోర్టులను ఇచ్చి డ్యాం భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేసింది. తాజాగా గురువారం నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) చైర్మన్ వివేక్ త్రిపాఠి ఆధ్వర్యంలో నిపుణుల బృందం పరిశీలించింది.

డ్యాం భద్రతకు ముప్పుగా మారిన ఫ్లంజ్‌పూల్ గుంత!

శ్రీశైలం ప్రాజెక్టు ఆనకట్ట స్పిల్‌వే గేట్ల నుంచి అతివేగంగా కింద పడే వరద మళ్లీ ఎగిరి పడే ప్రాంతం (ఫ్లంజ్‌పూల్)లో భారీ గుంత ఏర్పడింది. దీనిపై పలు కమిటీలు అధ్యయనం చేశాయి. దీనివల్ల డ్యాం భద్రతకు, ప్రాజెక్టు రెండు వైపుల ఉన్న గట్లు, ఆనకట్ట పునాదిపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇప్పటికే నష్టం జరిగిన ప్రొటెక్షన్ సిలిండర్స్ రిహాబిటేషన్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలి. ఫ్లంజ్‌పూల్ కుడి, ఎడమ గట్లకు నష్టం జరగకుండా మరమ్మతులు చేపట్టాలని, కొంత కాలంగా రివర్స్ స్లూయిస్ గేట్లు నిర్వహణ సక్రమంగా లేదని, అత్యవసర సమయాల్లో పలు సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉండటంతో తక్షణమే దృష్టి సారించాలి. డ్యాం 780 అడుగులు, 680 అడుగులు, 490 అడుగులు వద్ద మూడు గ్యాలరీలు ఉన్నాయి. 490 అడుగుల గ్యాలరీలో పెద్ద ఎత్తున సీపేజ్ ఉందని, పలు చోట్ల మెట్లు, నేల దెబ్బతిన్నాయని.. వీటిని తక్షణ మరమ్మతులు, సీపేజీ నీటిని గ్యాలరీ కాలువకు మళ్లించేలా చర్యలు చేపట్టాలి. ప్రాజెక్టు నిర్మించి 40 ఏళ్లు పైబడటంతో భూకంప ప్రమాదంపై మరోసారి అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని నిపుణుల కమిటీలు ఇచ్చిన నివేదికల్లో సూచించారు.

శ్రీశైలం డ్యాం భద్రతపై నిపుణుల కమిటీలు చేసిన సూచనలు

- డ్యాం మ్యాగ్జిమమ్ వాటర్ లెవల్ (ఎండబ్ల్యూఎల్) 890 అడుగులు. ప్రాబబుల్ మ్యాగ్జిమమ్ ఫ్లడ్ (పీఎంఎఫ్) 26.50 లక్షల క్యూసెక్కులు అంచనా వేస్తే.. 2009లో పీఎంఎఫ్‌కు దగ్గరగా వరద వచ్చింది. డ్యాం భద్రతలో రాజీ పడకుండా ప్రాబబుల్ మ్యాగ్జిమమ్ ఫ్లడ్ నిర్వహణకు స్పిల్‌వే సామర్థ్యాన్ని పెంచాలి. శ్రీశైలం డ్యాం 5 కిలో మీటర్లు ఎగువ భాగంలో అదనపు స్పిల్‌వే నిర్మాణం, అవసరమైతే గండి కొట్టేందుకు బ్రీచింగ్ సెక్షన్ ఉండేలా నిర్మించాలని సూచించింది.
- డ్యాం భద్రత దృష్ట్యా కృష్ణా బేసిన్ నుంచి కొంత వరదను కుందూ వంటి సమీప బేసిన్‌కు మళ్లించవచ్చు. శ్రీశైలం ఉపరితలంలో కుడివైపున (రైట్ బ్యాంక్) పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యూలేటర్ ద్వారా చెన్నైకు తాగునీరు, తెలుగుగంగ, ఎస్‌ఆర్‌బీసీ ప్రాజెక్టులకు కొంత వరద, అదే విధంగా ఎడమ వైపున కూడా వరద మళ్లించడానికి అనువైన ప్రాంతం కోసం అధ్యయనం చేయాలి.
- కేంద్ర జలసంఘం, ఐఎండీల వద్ద ఆధునిక వ్యవస్థలు ద్వారా డ్యాంలో చేరే వరదను ఎప్పటికప్పుడు అంచనా వేసి వచ్చే వరదను బట్టి జలాశయంలో ఉన్న నీటిని ముందుగా ఖాళీ చేయడం ఒక మార్గం.
- ప్రస్తుత స్పిల్‌వేకు ఎక్కువ ఎత్తులో రేడియల్ క్రస్ట్ గేట్లు ఉండేలా మార్పు చేయాలి. ప్రస్తుత స్పిల్‌వే క్రస్ట్ లెవల్ తగ్గించే విషయాలను పరిశీలించాలి. దీని వల్ల ప్రాజెక్టు ప్రయోజనాలపై పడే ప్రభావాన్ని పరిశీలించాలి.
- డ్యాంను ప్రస్తుత గరిష్ట నీటి మట్టం (ఎండబ్ల్యూఎల్)కు తగ్గట్టుగా ఎత్తు పెంచితే.. ఎగువన పలు గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. ఆ విషయాలను పరిగణలోకి తీసుకోవాలని పాండ్యా కమిటీ సూచించింది.

డ్రిప్-2 కింద రూ.139 కోట్లతో ప్రతిపాదన

ఫ్లంజ్‌పూల్‌లో భారీ గుంత వల్ల డ్యాం భద్రతకు, ప్రాజెక్టు రెండు వైపుల ఉన్న గట్లు, ఆనకట్ట పునాదిపై తీవ్ర ప్రభావం పడుతుందని వివిధ కమిటీలు నిగ్గు తేల్చాయి. ఇప్పటికే నష్టం జరిగిన ప్రొటెక్షన్ సిలిండర్స్ రిహాబిలిటేషన్‌పై చర్యల కోసం తక్షణ కార్యాచరణ చేపట్టాలని పాండ్యా కమిటీ సూచింది. సిలండర్స్ రిపేరి చేయాలంటే ఆప్రాన్ దగ్గరకు వెళ్లేందుకు నిర్మించిన అప్రోచ్ రోడ్డు 2009 వరదలకు తెగిపోయింది. ఇలాంటి ఎన్నో సమస్యలు ఉన్నాయి. ప్రాజెక్టు శాశ్వత మరమ్మతుల కోసం 'డ్యాం రిహాబిటేషన్ అండ్ ఇంప్రూమెంట్ ప్రొగ్రాం' (డ్రిప్)-2 కింద రూ.139 కోట్లు నిధలు ఇవ్వాలని ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపించారు. నిధులు మాత్రం విడుదల కాకపోగా పలు కొర్రీలు పెట్టి నిధులు ఇచ్చే ప్రపంచ బ్యాంక్ వెనక్కి పంపిందని సమాచారం.

డ్యాంను పరిశీలించిన ఎన్‌డీఎస్‌ఏ బృందం

పదేళ్లుగా పలు నిపుణుల కమిటీలు అధ్యయనం చేసి డ్యాం భద్రత, నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మరమ్మతులపై నివేదికలు ఇచ్చినా పాలకుల్లో మాత్రం చిత్తశుద్ధి కనిపించడం లేదు. గురువారం నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) చైర్మన్ వివేక్‌త్రిపాఠి నేతృత్వంలోని నిపుణుల బృందం, కేఆర్‌ఎంబీ సభ్యులు డ్యాం భద్రత, నిర్వహణ. నీటి నిల్వలు, వినియోగం తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్టు ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించారు. జలవనరుల శాఖ ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌భాషా, శ్రీశైలం ప్రాజెక్టు ఎస్‌ఈ శ్రీరామచంద్రమూర్తి డ్యాం భద్రత, నిర్వహణ వివరాలు వివేక్ త్రిపాఠి బృందానికి వివరించారు. సర్వేలు, అధ్యయనాలు, సమీక్షల పేరిట కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ శ్రీశైలం డ్యాం భద్రత, నిర్వహణ, ఫ్లంజ్‌పూల్ గుంతలు సహా వివిధ మరమ్మతులకు డ్రిప్-2 కింద ప్రతిపాదనలు పంపిన రూ.139 కోట్లు తక్షణం మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



శ్రీశైలం డ్యాంను పరిశీలిస్తున్న ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ వివేక్ త్రిపాఠి బృందం

ఎన్‌డీఎస్‌ఏ బృందానికి సమగ్ర వివరాలు అందించాం

శ్రీశైలం ప్రాజెక్టు భద్రత, నిర్వహణపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) చైర్మన్ వివేక్ త్రిపాఠి బృందం పరిశీలించింది. భద్రతకు తీసుకుంటున్న చర్యలు, చేపట్టాల్సిన పనులు, ఫ్లంజ్‌పూల్ గుంత మరమ్మతులు వంటి సమగ్ర వివరాలు అందించాం. డ్రిప్-2 కింద రూ.139 కోట్లతో ప్రతిపాదనలు పంపితే.. పలు సవరణలు, సూచనలతో ప్రపంచ బ్యాంక్ వెనక్కి పంపిన మాట నిజమే. ప్రపంచ బ్యాంక్ సూచన మేరకు మళ్లీ నివేదిక పంపుతాం. - **కబీర్‌బాషా, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ సీఈ, కర్నూలు**

పాఠశాలల విద్య బలోపేతానికి కృషి చేస్తా

డీఈవో శామ్యూల్



కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 9: జిల్లాలో పాఠశాలల స్థాయి విద్య బలోపేతానికి కృషి చేస్తానని జిల్లా విద్యాశాఖ అధికారి సామ్యూల్ అన్నారు. శుక్రవారం బదిలీపై వచ్చిన డీఈవో సామ్యూల్ ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా పదో తరగతి పరీక్షల్లో అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఉపాధ్యాయులు సహకరించి వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఏడీ-1 శ్యామూల్ పాల్, ఏడీ-2 శ్రీనివాసులు, సూపరింటెండెంట్లు, సిబ్బంది నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఈవోను కలిసి అభినందనలు తెలియజేశారు. అలాగే జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ విజయజ్యోతి కుమారి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కరెన్న, సూపరింటెండెంట్ కోటేశ్వరరావు, సిబ్బంది డీఈవోను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అలాగే యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటిల్, ఎస్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్. గోకారి, టీకే జనార్దన్, అపస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగస్వామి నాయక్, నాగిరెడ్డి, డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కరెకృష్ణ, గట్టు తిమ్మప్ప, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణారెడ్డి, రామకృష్ణ, ఏపీటీఎఫ్ నాయకులు ఇస్మాయిల్, మరియానందం, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి అభినందనలు తెలిపారు.

చిన్నారులకు 'ఆల్బెండజోల్' తప్పనిసరి

కలెక్టర్ జి. సృజన

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 9: పిల్లల్లో నులి పురుగుల నివారణ సమస్య కోసం తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలను ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. శుక్రవారం జాతీయ నులి పురుగుల నివారణ దినం సందర్భంగా నగరంలోని ఇందిరాగాంధీ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నులి పురుగులు శరీరంలో ఉండటం వల్ల చదువులో ఏకాగ్రత లోపించడంతో పాటు శరీరంలో రక్తహీనత, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపునొప్పి, వికారం, విరేచనాలు, బరువు తగ్గడం వంటి అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. విద్యార్థులు ఈ మాత్రలను తీసుకోవడం వల్ల శారీరకంగా మానసికంగా ధృడంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఒకవేళ శుక్రవారం మాత్రలు వేసుకోని పిల్లలకు ఈ నెల 16న ఆల్బెండజోల్ మాత్రలను అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ హేమలత, అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ మాధవి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్, డైస్ మేనేజర్ ఇర్ఫాన్‌బాషా, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రలను వేయిస్తున్న కలెక్టర్

వైసీపీని ఇంటికి పంపడం ఖాయం: కోట్ల

డోన్, ఫిబ్రవరి 9: రాష్ట్రంలో దోపిడీ పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి పంపడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం డోన్ మండలం గుమ్మకొండ గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో కోట్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుమ్మకొండ సర్పంచ్ దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ అరాచక పాలన సాగిస్తూ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని ఆరోపించారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసి నియంత పాలన సాగిస్తున్న జగన్‌కు పతనం తప్పదన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా వైసీపీ ప్రభుత్వం అన్యాయం చేసిందని మండిపడ్డారు. కరువు రైతులను ఉదారంగా ఆదుకోవాల్సిన ప్రభుత్వమే కరువు మండలాలుగా ప్రకటించకుండా రైతులకు తీరని నష్టం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గుమ్మకొండలో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

దుర్మార్గ పాలనకు చరమగీతం పాడదాం

- టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీల రక్షణ చట్టం తెస్తాం
- 'జయహో బీసీ' సదస్సులో మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ఆదోని, ఫిబ్రవరి 9: వైసీపీ దుర్మార్గపాలనకు చరమ గీతం పాడాలని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక జేబీ గార్డెన్‌లో జయహో బీసీ సభను బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు ఆరేకల్లు రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకటరాముడు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా మీనాక్షినాయుడు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి బీసీలకు రక్షణ కరువైందని, వారికి రక్షణ కల్పించే దిశగా, భరోసా ఇచ్చేందుకు జయహో బీసీ సభ నిర్వహిస్తున్నామని అన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించిన ఘనత టీడీపీదేనని, 34 శాతం ఉన్న రిజరేషన్లను, 24 శాతానికి తగ్గించి జగన్ రెడ్డి బీసీలకు అన్యాయం చేశారన్నారు. బీసీలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం మినహా ఒక్క రూపాయి నిధులు కూడా వెచ్చించలేదన్నారు. బీసీల ఆన్‌లైన్ భూమి 8వేల ఎకరాలను కూడా వెనక్కి తీసుకుందన్నారు. పనిముట్లు అందించే ఆదరణ పథకాన్ని రద్దు చేసిందని విమర్శించారు. బీసీల తరపున టీడీపీ నాయకులు పోరాడుతోంటే, వారిపై అక్రమంగా కేసులు పెట్టి వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉమాపతి నాయుడు, బత్తిన కుబేర్‌నాథ్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకట చౌదరి, యువ నాయకుడు మారుతి నాయుడు, దొడ్డనగేరి శివప్ప, రంగన్న, దిబ్బనకల్లు లక్ష్మన్న, అయ్యన్న, కపటి మాధవ, పార్వతి, వెంకటేష్, రంగస్వామి, మారుతి రావు, భాను ప్రకాష్ తిమ్మప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

పోలింగ్ కేంద్రాలపై కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 9: జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రం బయట ఓటర్ల సంఖ్య, కేంద్రం వివరాలను పెయింటింగ్‌తో స్పష్టంగా రాయించాలని కలెక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవో, తహసీల్దార్లు, ఆర్‌ఐవోలతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కులగణన సర్వేలో 14 మండలాలు వెనుకబడి ఉన్నాయన్నారు. వెల్దుర్తి, క్రిష్ణగిరి, కోసిగి, మద్దికెర, కర్నూలు కార్పొరేషన్లలో కులగణన సర్వేలో వెనుకబడి ఉన్నాయని వెల్లడించారు. ఆదివారంలోపు పురోగతి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితాకి సంబంధించి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఆర్‌వోలను ఆదేశించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కమిషనర్ భార్గవ్ తేజ, ఆర్డీవోలు పాల్గొన్నారు.



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రసాదం అపవిత్రం..!

- ప్రసాదంలో ఎముక ముక్కలు
- విచారణకు ఆదేశించిన ఆలయ అధికారులు
- ఘటనపై మండిపడుతున్న భక్తులు



పులిహోరలో దర్శనమిచ్చిన ఎముక ముక్కలు

శ్రీశైలం, ఫిబ్రవరి 9: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల ప్రసాదంలో ఎముక ముక్కలు ప్రత్యక్షమవడం కలకలం రేపింది. హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు భక్తులు శ్రీశైలం స్వామి, అమ్మవార్ల దర్శనార్థం శ్రీశైలం వచ్చారు. శుక్రవారం ఉదయం మల్లన్న దర్శనం చేసుకుని భ్రమరాంబికా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపలికి వచ్చే సమయంలో భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను అందజేస్తున్నారు. ఈ క్రమంలో వేణుగోపాల్ అనే వ్యక్తి అమ్మవారి ప్రసాదం పులిహోరను స్వీకరించాడు. అయితే పులిహోర ప్రసాదంలో రెండు ఎముకముక్కలు రావడంతో భక్తుడు కంగుతిన్నాడు. అమ్మవారి ప్రసాదంలో ఎముక ముక్కలు ఎలా వచ్చాయని వెంటనే వాటిని తమ ఫోన్లలో చిత్రీకరించి ఆలయ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. స్వామి, అమ్మవార్ల ప్రసాదంలో ఎముక ముక్కలు రావడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి హరిదాసును వివరణ కోరగా విచారణకు అదేశించామని తెలిపారు. ఈ విషయం తెలిసిన భక్తులు పరమ పవిత్రమైన శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లు కొలువైవున్న మహాపుణ్యక్షేత్రంలో అమ్మవారికి నివేదించిన ప్రసాదంలో ఎముక ముక్కలు ప్రత్యక్షమవడంపై భక్తులు తీవ్రంగా మండిపడుతున్నారు. శ్రీశైలం పుణ్యక్షేత్రం పవిత్రతకు భంగం కలిగే విధంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. భక్తులు వారి మొక్కులను తీర్చుకునేందుకు ఎంతో పవిత్రంగా ఇంటి వద్ద పూజలు నిర్వహించుకుని శ్రీశైల మల్లన్న దర్శనానికి వస్తారు. స్వామి, అమ్మవార్లకు మొక్కులు తీర్చుని స్వామి, అమ్మవార్ల ప్రసాదాలను స్వీకరిస్తారు. అటువంటి ప్రసాదంలో ఎముక ముక్కలు రావడం సిబ్బంది నిర్లక్ష్యమా..అధికారుల పర్యవేక్షణ లోపమా..అని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు శబరి స్పందిస్తూ భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా పాలన జరుగుతోందని మండిపడ్డారు. ఇదిలా ఉండగా ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేసి ఉంటారా? అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

దేవదాయ శాఖలో అసిస్టెంట్ కమిషనర్లుగా పదోన్నతి

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 9: దేవదాయ శాఖలోని నలుగురు అసిస్టెంట్ కమిషనర్లకు డిప్యూటీ కమిషనర్లుగా పదోన్నతి కల్పించిన విషయం తెలిసిందే. ఇదే క్రమంలో శుక్రవారం నాడు మరో నలుగురు సూపరింటెండెంట్, గ్రేడ్-1 ఈవోలకు అసిస్టెంట్ కమిషనర్లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నలుగురు అసిస్టెంట్ కమిషనర్లుగా పదోన్నతి పొందారు. నంద్యాల జిల్లా దేవదాయ శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న బీ. సుధాకర్‌రెడ్డికి అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి కల్పించారు. కర్నూలు జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో పని చేస్తున్న పాండురంగారెడ్డికి అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి కల్పించారు. కర్నూలు డివిజన్ జ్యూవెల్లరీ వెరిఫికేషన్ ఆఫీసర్‌గా కర్నూలు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న జి. కామేశ్వరమ్మ, ప్రసన్న లక్ష్మిలను అసిస్టెంట్ కమిషనర్లుగా పదోన్నతి కల్పించారు. జి. కామేశ్వరమ్మను నంద్యాల జిల్లా నందవరం మండలం శ్రీచౌడేశ్వరి దేవతా దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా, ప్రసన్న లక్ష్మిని చిత్తూరు జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా నియమిస్తూ బదిలీ చేసినట్లు డిప్యూటీ కమిషనర్ కార్యాలయం అధికారులు పేర్కొన్నారు.

ఇంటర్ సైన్స్ ప్రాక్టికల్స్‌లో పొరపాట్లు రానీవద్దు

ఆర్‌ఐవో గురువయ్యశెట్టి




సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 9: ఈ నెల 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ జనరల్ కోర్సు సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో పొరపాట్లకు తావివ్వరాదని పరీక్షల నిర్వాహకులను ఎగ్జామినేషన్స్ కన్వీనర్, ఆర్‌ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి సూచించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. జనరల్ కోర్సు సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలకు మొత్తం 14534 మంది విద్యార్థులు హాజరవుతున్నారని అన్నారు. ఇందులో ఎంపీసీ విద్యార్థులు 9750 మంది, బైపీసీ గ్రూపు విద్యార్థులు 4784 మంది హాజరవుతున్నారని అన్నారు. మొదటి విడత సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలు 11 నుంచి 14వ తేదీ వరకు జరుగుతాయన్నారు. 77 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే రెండో విడత సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలు 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. అందుకు 38 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్స్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్స్ పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షలకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. అన్ని కేంద్రాలను అనుసంధానం చేసి పర్యవేక్షిస్తామన్నారు. ఎక్కడైనా పొరపాట్లు జరిగితే.. పరీక్ష కేంద్రాల నిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ పరీక్ష కేంద్రాలను ఆర్‌ఐవో, డీఈసీ కమిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పర్యవేక్షిస్తాయని అన్నారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ నెంబరు. 8121127019, ల్యాండ్ నెంబర్.08518-222047లను ఏర్పాటు చేశామని, ఎక్కడైనా ఏదైనా సమస్య ఎదురైతే ఈ నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో డీఈసీ మెంబర్లు పరమేశ్వరరెడ్డి, జీ.లాలెప్ప, ప్రభు పాల్గొన్నారు.

నగలకు మెరుగు పెడతామని బురిడీ

మత్తుమందు ఇచ్చి నాలుగు తులాల బంగారు చోరీ



దుండగులు ఉపయోగించిన గిన్నెలు

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 9: బంగారు నగలకు మెరుగు పెడతామనే పేరుతో ఇద్దరు దుండగులు ఓ మహిళను మోసగించారు. మాయ మాటలు చెప్పి, మత్తుమందు ఇచ్చి నాలుగు తులాల బంగారుచైను, ఉంగరాన్ని ఎత్తుకెళ్లిన ఘటన ఎమ్మిగనూరు పట్టణంలోని లక్ష్మీపేటలో చోటుచేసుకుంది. ఈరన్న, ఉమాదేవి దంపతులు లక్ష్మీపేటలో నివాసం ఉంటున్నారు. ఈరన్న దుకాణానికి వెళ్లటంతో ఇంట్లో ఉన్న ఉమాదేవి వద్దకు దుండగులు వచ్చి బంగారు, వెండి నగలకు, ఇత్తడి, రాగి వస్తువులకు మెరుగులు పెడతామని నమ్మబలికారు. అంతేగాక తమ వద్ద బంగారు నగలకు మెరుగు దిద్దే పౌడర్ ఉందని తీసుకోవాలన్నారు. ఇందుకు ఉమాదేవి తమకు అవసరం లేదని చెప్పింది. అయితే ఇత్తడి వస్తువులను మెరుగు చేస్తుండగా కుమార్తె వెండి పట్టీలు మెరుగు కోసం ఉమాదేవి ఇచ్చింది. అనంతరం భర్త ఉంగరంతో పాటు మూడు తులాల బంగారు గొలుసును మెరుగు కోసం ఇచ్చింది. అంతలోనే ఆమె చేతిలో తెల్లటి పౌడర్ ఇవ్వడంతో ఆమె మత్తులోకి జారుకుంది. ఆ వెంటనే దుండగులు ఉంగరం, బంగారు గొలుసు, వెండి పట్టీలతో ఉడాయించారు. కాసేపటి తర్వాత తేరుకున్న ఉమాదేవి భర్తతో కలసి పోలీసులను ఆశ్రయించింది. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రాలయం అభివృద్ధికి కృషి

- భక్తుల సౌకర్యార్థం 12 అంతస్థుల భవనం ఏర్పాటుకు ప్రణాళిక
- వంద ఎకరాల్లో తాగునీటి ఏర్పాటుకు సన్నాహాలు
- పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు వెల్లడి



తిక్కారెడ్డితో చర్చిస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం, ఫిబ్రవరి 9: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం సర్వముఖాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. శుక్రవారం ఆయన పట్టణ ప్రముఖులు, విలేకరులతో మాట్లాడారు. రాఘవేంద్ర సర్కిల్‌లోని పాత ఆర్‌అండ్‌బీ భవనంలో తాను శ్రీమఠం పీఠాధిపతిగా 12 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా 12 అంతస్థుల భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు క్లాక్‌రూమ్, వసతి, పార్కింగ్, పరిమళ ప్రసాదం సేవా కౌంటర్లు వంటి వసతులు కల్పించేందుకు ఇప్పటికే దాతలు ముందుకు వచ్చారనితెలిపారు. అదేవిధంగా మంత్రాలయం గ్రామానికి వంద ఎకరాల్లో ఎస్ఎస్ ట్యాంకును నిర్మించి శుద్ధజలాన్ని అందించేందుకు ఇప్పటికే ప్రణాళిక రూపొందించామన్నారు. మంత్రా లయం శివారులో మినీ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు స్థల పరిశీలన జరుగుతోందన్నారు. ఇన్ఫోసిస్ సుధానారాయణమూర్తి, టాటా గ్రూప్స్, రిలయన్స్ అధినేత అంబానీలు మంత్రాలయం అభివృద్ధికి సహకరిస్తున్నట్లు తెలిపారు. భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న దృష్ట్యా వసతులు, తాగునీరు, పరిశుభ్రత పాటించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పూజారి వ్యాసరాజాచార్, జోనల్ మేనేజర్ శ్రీపతాచార్, ద్వారపాలక అనంత స్వామి, పవనాచార్, భీమ్‌సేన్‌రావు, వ్యాసరాజాచార్ పాల్గొన్నారు.

పీఠాధిపతిని కలిసిన తిక్కారెడ్డి : మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులను నియోజకవర్గ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి కలిశారు. ఈయనతో పాటు టీడీపీ మండల కన్వీనర్ వెంకటేశ్, బూదూరు మల్లికార్జున రెడ్డి, ఎల్లారెడ్డి, విజయరామిరెడ్డి, వెంకటేశ్, పవన్ కుమార్ రెడ్డి, అబ్దుల్లా, గోపాల్, జెట్టి వీరేష్, చంద్ర తదితరులు పీఠాధిపతిని కలిశారు.

రైతుల కోసం సారథి పోర్టల్

- ఇక సేవలన్నీ డిజిటల్‌లోనే
- ప్రారంభించిన కేంద్ర వ్యవసాయ మంత్రి అర్జున్ ముండా

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 9: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంతో పాటు పలు బీమా ఉత్పత్తులు, సేవలను రైతులకు డిజిటల్ పద్ధతిలో అందించడానికి సారథి అనే వెబ్ పోర్టల్‌ను కేంద్ర వ్యవసాయ మంత్రి అర్జున్ ముండా గురువారం ప్రారంభించారని, దీని వల్ల రైతులకు సకాలంలో అన్ని ప్రయోజనాలు అందుబాటులోకి వస్తాయని వ్యవసాయ శాఖ కర్నూలు ఏడీఏ శాలురెడ్డి తెలిపారు. పంటల బీమా పథకం మీద రైతుల ఫిర్యాదులను పరిష్కరించడానికి కిసాన్ రక్షక్ పోర్టల్, 14447 నెంబరు హెల్ప్‌లైన్‌ను మంత్రి ప్రారంభించారన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఫసల్ బీమా, సవరించిన వడ్డీ సబ్సిడీ పథకం, కిసాన్ క్రెడిట్ కార్డుల గురించి రైతులకు సమాచారం అందించే ఏర్పాటు చేశామన్నారు. ఏకగవాక్ష సారథి పోర్టల్ రైతులకు డిజిటల్ పంథాలో పంట బీమా పొందే సౌకర్యాన్ని అందిస్తుందని ఏడీఏ తెలిపారు.

ఈ ఏడాదిలోనే పశుగణన

దేశంలో పశుగణను చేపట్టేందుకు కేంద్ర పశుసంవర్ధకశాఖ సిద్ధమైందని, జనాభా లెక్కల మాదిరిగానే ఈ పశుగణన సెప్టెంబరు-డిసెంబరు మధ్య జరుగుతుందని పశుసంవర్థక శాఖ జేడీ రామచంద్రయ్య తెలిపారు. మొబైల్ టెక్నాలజీతో ఈ ప్రక్రియను చేపడుతారని, దేశ వ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో మూగజీవాలకు సంబంధించి ఖచ్చితమైన వివరాలను సేకరిస్తామన్నారు.

ముస్లింలను మోసగిస్తున్న కాటసాని

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ

బనగానపల్లె, ఫిబ్రవరి 9: కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తూ షాదీఖానాలు అంటూ ముస్లింను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మోసం చేస్తున్నాడని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతేడాది నవంబరు నెలలో కోవెలకుంట్లలో, డిసెంబరు నెలలో బనగానపల్లెలో కమ్యూనిటీ హాళ్లను ప్రారంభించి వాటిని షాదీఖానాలు అంటూ ముస్లింలను మోసగించారన్నారు. ఒక్కో కమ్యూనిటీ హాల్‌ను రూ.120 కోట్లతో రెండింటిని ఎమ్మెల్యే కాటసాని షాదీఖానాలు అని చెప్పి ముస్లిం మతగురువులతో ప్రార్థనలు చేయించాడన్నారు. వాస్తవానికి అవి షాదీఖానాలు కాదని కమ్యూనిటీ హాళ్లని అన్నారు. అందరూ వివాహాది శుభకార్యాలు చేసుకునేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. కానీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ముస్లిం మైనార్టీలను ఓట్ల కోసం మభ్య పెట్టడానికి బనగానపల్లె, కోవెలకుంట్లలో నిర్మించేవి షాదీఖానాలు అంటూ మోసం చేశాడన్నారు. ఎన్నికల సమయంలో కేవలం మైనార్టీల ఓట్ల కోసమే కాటసాని రామిరెడ్డి ఇలాంటి డ్రామాలు ఆడుతున్నారన్నారు. ముస్లింలకు షాదీఖానాలు నిర్మిస్తే తాము సంతోషంగా స్వాగతిస్తామని, అయితే మైనార్టీలను మోసగిస్తే మాత్రం చూస్తూ ఊరుకోమన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు బనగానపల్లెలో షాదీఖానా కోసం కోటి రూపాయలు నిధులు మంజూరు చేయించానని గుర్తు చేశారు. ఆ నిధులు సరిపోకపోతే రూ.30 లక్షల మేర తన సొంత నిధులు ఇచ్చినట్లు తెలిపారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ షాదీఖానా నిర్మాణాలను నిలిపివేయించి తప్పుచేసిందన్నారు. మళ్లీ తన సొంత నిధులతో షాదీఖానాను పూర్తి చేయాలని పనులు ప్రారంభిస్తే తనపై తప్పుడు కేసులు బనాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే మర్కస్ మసీదు వద్ద ముస్లింలకు పట్టాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె ఉప సర్పంచ్ బురానుద్దీన్, టీడీపీ పట్టణాధ్యక్షుడు కాశీంబాబు, మైనార్టీ నాయకులు రాయలసీమ సలాం, పూల కలాం, అల్తాఫ్ హుసేన్, సయ్యద్ హుసేన్, రజాక్, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం జన్‌మన్‌కు కార్యాచరణ సిద్ధం చేయండి

- గిరిజన గూడేల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం
- శ్రీశైలం ఐటీడీఏ పీవో రవీంద్రారెడ్డి



మాట్లాడుతున్న శ్రీశైలం ఐటీడీఏ పీవో రవీంద్రారెడ్డి

ఆత్మకూరు, ఫిబ్రవరి 9: గిరిజన సాధికారత, అద్భుత భారతదేశమే లక్ష్యంగా దేశంలోని ఆదివాసీ తెగల అభ్యున్నతికై ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జన జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జమన్‌మన్) కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని శ్రీశైలం ఐటీడీఏ పీవో రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం ఆత్మకూరులోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో చెంచుగూడేల్లో వున్న 14 మండలాల ఎంపీడీవోలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీల అభ్యున్నతి కోసం రూ.24వేల కోట్ల బడ్జెట్‌తో కేంద్ర ప్రభుత్వం పీఎం జన్‌మన్ కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. మొత్తంలో 18రాష్ట్రాలతో పాటు ఒక కేంద్రపాలిత ప్రాంతంలో 9 మంత్రిత్వ శాఖల సమన్వయంతో పీఎం జన్‌మన్ ద్వారా 75పీవీటీజీ కమ్యూనిటీల ఆదివాసీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇందులో ప్రధానంగా 11 ప్రాథమిక సౌకర్యాల కల్పనే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ప్రత్యేకించి అందరికి ఇళ్లు, ప్రతిఇంటికి తాగునీరు, విద్యుత్, గ్రామగ్రామాన రహదారులు, అందరికి నాణ్యమైన విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం, నైపుణ్య వికాసం, జీవనోపాధులు మెరుగుపర్చడం, ప్రచార సాధనాల సౌకర్యాలను మెరుగుపర్చాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేసేందుకు ఎంపీడీవోలు కార్యాచరణ సిద్ధం చేయాలని అన్నారు. సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకుని ఆయా గూడేల్లో గిరిజనుల అభ్యున్నతికి చేపట్టాల్సిన ప్రణాళికను రూపొందించాలని వివరించారు. ఈ పీఎం జన్‌మన్ మండల కమిటీకి ఎంపీడీవో చైర్మన్‌గా ఉంటారని, ఆయా శాఖలతో సమన్వయం చేసుకుని గిరిజన గూడేల్లో మౌలిక సదుపాయాల కల్పనకు దృష్టి సారించాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రధాన మంత్రి ఉజ్వల యోజన ద్వారా అర్హులైన గిరిజనులకు గ్యాస్‌స్టౌలను పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం రవికుమార్, నాబార్డు జీఎం సుబ్బారెడ్డి, హౌసింగ్ డీఈ సుంకిరెడ్డి, ఐటీడీఏ ప్రాజెక్ట్ మేనేజర్ కేజీనాయక్, ప్రాజెక్ట్ హార్టికల్చర్ ఆఫీసర్ ధనుంజయరెడ్డి, వెటర్నరీ డాక్టర్ ధనలక్ష్మి తదితరులు ఉన్నారు.

వెట్టిచాకిరీ చేయించుకుంటే శిక్ష



ప్రసంగిస్తున్న నాగ శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్), ఫిబ్రవరి 9: వెట్టిచాకిరీ నిషిద్ధమని, కఠిన శిక్షలకు గురవుతారని కర్నూలు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు తెలియజేశారు. సెర్ప్ అనే ఎన్‌జీవో సహాయంతో స్థానిక లోక్ అదాలత్ భవనంలో శుక్రవారం జరిగిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెట్టిచాకిరీ వంటి సాంఘిక దురాచారాన్ని వీడనాడాలని అన్నారు. లేకపోతే చర్యలు తప్పవని అన్నారు. వెట్టి చాకిరి చేయించుకుంటే మూడు సంవత్స రాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.50వేలు జరిమానా కూడా ఉంటుందని ఆయన హెచ్చరించారు. శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షు డు వెంకట హరినాథ్, చీఫ్ లీగల్ ఎయిర్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, దిశా డీఎస్పీ ఐ.సుధాకర్ రెడ్డి, ట్రైనీ డీఎస్పీ పి.భవాని, డిప్యూటీ లేబర్ కమిషనర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సాంబ శివ, పలువురు ఎన్జీవో, చైల్డ్ వెల్ఫేర్ డిపార్టుమెంటు అధికారులు, న్యాయ విద్యార్థులు, పారాలీగల్, వలంటీర్లు పాల్గొన్నారు.

అంకెల్లో సంక్షేమం.. ఆచరణలో శూన్యం

నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 9: వైసీపీ అంకెల్లో సంక్షేమం.. ఆచరణలో శూన్యమని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎన్నికల స్టంట్‌గా ఉందన్నారు. వైసీపీ ఎన్నికల ప్రచారం కోసం బడ్జెట్ ప్రవేశ పెట్టడంలో స్పష్టంగా రాష్ట్ర ప్రజలకు అర్థమవుతుందన్నారు. రాష్ట్రంలో కరువుతో ప్రజలు తల్లడిల్లుతుంటే.. అలాగే వలసలు కొనసాగుతుంటే.. అద్భుతంగా ఉన్నట్లు మంత్రి బుగ్గన అసెంబ్లీలో చెప్పడం దారుణమన్నారు. అభివృద్ధి గురించి చెబుతున్న జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో కనీసం రోడ్లు కూడా వేయలేని దుస్థితిలో ఉందన్నారు. ఓటాన్ అకౌంటు బడ్జెట్‌లో అసలు ఈ జిల్లాకు ఎంత కేటాయించారన్నది స్పష్టత లేదన్నారు. రూ.27,884 కోట్లుగా చెప్పిన సర్కార్ సామాన్యులపై విద్యుత్ చార్జీల రూపంలో ఇప్పటికే రూ. వేల కోట్ల భారం మోపిందని మండిపడ్డారు. ఎన్నికల ముందు మద్య నిషేదం అని చెప్పి.. అధికారంలోకి రాగానే జగన్ తన బ్రాండ్లను అమ్మి కోట్లాది రూపాయలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడేకారి శేఖర్, నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

కోసిగి, ఫిబ్రవరి 9: మండల కేంద్రంలోని ఓ పాఠశాల విద్యార్థి తండ్రి మందలించాడని వ్యవసాయానికి తెచ్చిన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు కోసిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. సక్రమంగా చదువుకోవాలని, బడికి వెళ్లాలని తండ్రి మందలించడంతో ఆత్మహత్యాయత్నం చేశాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

కాలువలో పడి వైసీపీ నాయకుడిమృతి

నందికొట్కూరు ఫిబ్రవరి 9: మిడ్తూరు మండలం పీరుసాహెబ్‌పేట గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు కైపా శ్రీధర్‌రెడ్డి ప్రమాదవశాత్తు హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలో పడి మృతి చెందారు. గత రెండు రోజుల క్రితం కర్నూలులో పనులు ముగించుకొని తన స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలో ఉన్న హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలో ప్రమాదవశాత్తు పడ్డారు. ఆయన మద్యం సేవించి ఉన్నందు వల్ల నీటిలో కొట్టుకుపోయారు. కాలువ పక్కన ద్విచక్ర వాహనం ఉండడంతో కుటుంబ సభ్యులు గుర్తించి కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. వెల్దుర్తి మండలం మల్లెపల్లె వద్ద శ్రీధర్‌రెడ్డి మృతదేహం లభించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. శ్రీధర్‌రెడ్డి మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యేలు లబ్బి వెంకటస్వామి, ఐజయ్య, వైసీపీ సమన్వయకర్త దార సుధీర్, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు మిడ్తూరు మండల కన్వీనర్ ఖాతా రమేష్‌రెడ్డి, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య వేర్వేరుగా సందర్శించి నివాళి అర్పించారు.

ఎమ్మిగనూరులో దారుణం

- అనంతపురంవాసిపై వేటకొడవలితో దాడి
- తీవ్ర గాయాలు, కర్నూలుకు తరలింపు
- ఆర్థిక లావాదేవీలే దాడికి కారణం



ఘటనా స్థలంలో వీర నారాయణను పరిశీలిస్తున్న పోలీసులు

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 9: ఎమ్మిగనూరు పట్టణంలోని కోర్టు రోడ్డులో శుక్రవారం దారుణం చేటుచేసుకుంది. అనంతపురం జిల్లా కనగానపల్లి మండలం దాదులూరు గ్రామానికి చెందిన బుట్ట వీర నారాయణపై సీ బెళగల్ మండలం కంబదహాల్(తూర్పు కంపాడు)గ్రామానికి చెందిన కురువ ఈరన్న కొడవలితో విచక్షణారహితంగా దాడిచేశాడు. కురువ వీర నారాయణ, కురువ ఈరన్నల మధ్య ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. ఓ చెక్ బౌన్స్ కేసులో వీరనారాయణ కోర్టు హాజరయ్యాక, బయట చెట్టు కింద నిలబడి ఉన్నాడు. అప్పటికే కోర్టు బయట కాపు కాసుకొని ఉన్న ఈరన్న కొడవలితో వీర నారాయణపై దాడికి పాల్పడ్డాడు. తప్పించుకొని పరుగుతీసేందుకు ప్రయత్నించగా వెంటపడి వీరనారాయణను తలపైన, గొంతుపైన పొడి చేశాడు. దీంతో వీరనారాయణ కుప్పకూలి పడిపోయాడు. పోలీసులకు సంఘటనా స్థలానికి చేరుకొని రక్తంపు మడుగులో పడి ఉన్న వీర నారాయణను చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు జీజీహెచ్‌కు తరలించారు. పట్టణ ఇన్‌చార్జి సీఐ మోహన్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ అరెస్టులపై భగ్గుమన్న ఆశాలు




వీకర్ సెక్షన్ అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు, కల్లూరు పీహెచ్‌సీ వద్ద..

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 9: అక్రమ అరెస్టులపై ఆశా కార్యకర్తలు భగ్గుమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన చలో విజయవాడకు వెళ్లకుండా పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జే.నాగేశ్వరరావు, ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాలు ఈశ్వరీబాయ్ మాట్లాడుతూ విధుల్లో ఉన్న ఆశా వర్కర్లను పోలీసులు స్టేషన్‌కు రావాలని, లేదంటే ఇళ్ల వద్దకు వచ్చి అరెస్టు చేస్తామని బెదిరించడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఆశా



సి.బెళగల్ మండలం పోలకల్లులో..

వర్కర్లు శాంతి కుమారి, భూదేవి, పాపమ్మ, అనురాధ, జాకీర బేగం, సబితా, హేమలత, రబియా పాల్గొన్నారు.

● చలో విజయవాడలో జరిగిన అక్రమ అరెస్టులకు నిరసనగా కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశా వర్కర్లు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ నాయకులు కె.సుధాకరప్ప, జి.ఏసు హాజరై మాట్లాడారు. విజయవాడకు రాకుండా ఆశా వర్కర్లను ముం దురోజే ఎక్కడికక్కడే అరెస్టు చేసి నిర్బంధించడం అన్యాయమన్నారు. ఆశాలకు కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పనిభారం తగ్గించి గ్రావిటీ రూ.5లక్షలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాళ్లు వి.మహేశ్వరి, వి.అరుణ, సుజాత, సుంకులమ్మ, సుకన్య, జ్యోతి, హబీబున్నిసా, ఈశ్వరీ, శాంతమ్మ, ఇందిరా, కస్తూరిబాయి, హేమలత పాల్గొన్నారు.

సి.బెళగల్: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ నాయకురాలు లక్ష్మీకాంతమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పోలకల్లు పీహెచ్‌సీ ఎదుట ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా లక్ష్మీకాంతమ్మ మాట్లాడుతూ పాదయాత్రలో తమ సమస్యలను పరిష్కరిస్తామని జగన్ హామీ ఇచ్చి విస్మరించారన్నారు. కార్యక్రమంలో లక్షమ్మ, రంగమ్మ, మాబీ, శోభ పాల్గొన్నారు.

నేటి నుంచి హరిహర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న నగర బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 9: నగరంలోని తుంగభద్ర ఒడ్డున సంకల్‌బాగ్‌లో గల శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం (హరిహర క్షేత్రం)లో శ్రీవారి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ఈనెల 20 వరకు కొనసాగుతాయని నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కళ్లే చంద్రశేఖర్ శర్మ, కార్యదర్శి హెచ్‌కే రాజశేఖర్‌రావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వార్షిక బ్రహ్మోత్సవాల బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివా రం ఉదయం 10 గంటలకు ధ్వజారోహణ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ప్రారం భమవుతాయని తెలిపారు.

ఏసీబీ కేసులో లైన్‌మెన్‌కు జైలు, జరిమానా

కర్నూలు(లీగల్), ఫిబ్రవరి 9: వర్క్‌షాపునకు అవసరమైన రిపోర్టు ఇవ్వడానికి లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన లైన్‌మెన్‌కు మూడు సంవత్సరాల కారాగార శిక్ష, రూ.30వేలు జరిమానా విధిస్తూ కర్నూలు ఏసీబీ కోర్టు శుక్రవారం తీర్పు చెప్పింది. కర్నూలుకు చెందిన లైన్‌మెన్ కుందుకూరు ప్రభాకర్ ఫిర్యాది అయిన ఇలియాజ్‌బాషా వర్క్‌షాపుకు అవసరమైన కరెంటు సప్లయ్ కోసం రిపోర్టు ఇవ్వడానికి ఫిర్యాదికి లంచం డిమాండ్ చేశారు. అయితే ఫిర్యాది ఇలియాజ్ బాషా లంచం ఇవ్వకుండా ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో 2017 ఆగస్టు 16న నిందితుడు కుందుకూరు ప్రభాకర్ ఫిర్యాది నుంచి రూ.6వేలు లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. కోర్టులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో మూడు సంవత్సరాల కారాగార శిక్ష, రూ.30వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది.

తెలంగాణ మద్యం బాటిళ్లు సీజ్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 9: తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్న ఐదుగురు నిందితుల నుంచి 167 బాటిళ్లను సీజ్ చేసి, కేసులు నమోదు చేశామని సెబ్ సీఐ కేఆర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్. రవికుమార్ ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఉల్లిందకొండ గ్రామం వద్ద మోటార్ సైకిల్‌పై తెలుగు రమేష్, బెస్త మోహన్‌ల నుంచి 19 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా, మరో వాహనంపై సురేష్ వ్యక్తి వద్ద నుంచి 48 బాటిళ్లు, నగరంలోని బీ. క్యాంప్ వద్ద రాజేష్ అనే వ్యక్తి నుంచి 48 బాటిళ్లు, నగరంలోని ఆర్‌కేటీ వీధిలో వెంకటేష్ నుంచి 22 బాటిళ్లు, పర్ల గ్రామం వద్ద రామన్న అనే వ్యక్తి నుంచి 30 మద్యం బాటిళ్లను సీజ్ చేశామని తెలిపారు. వారి వద్ద మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈ తనిఖీల్లో పంచలింగాల చెక్ పోస్టు ఎస్ఐ ఆర్, పృథ్వీరాజు, ఎస్ఐ సీ. రెహన్‌బేగం, మారుతీ ప్రసాదు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో రాయితీ ఇవ్వాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 9: జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో రాయితీ ఇవ్వాలని ఫొటో, వీడియో జర్న లిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రామస్వామి కోరారు. శుక్రవారం డీఈవో కార్యాలయంలో డీఈవో సామ్యూయేల్ వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులు ఆర్థిక సమస్యతో తమ పిల్లలను చదివించుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. డీఈవోకు వినతి సమర్పించిన మధుసూదన్ రెడ్డి, శ్రీనివాసులు, రవి, నరసింహులు, పాల్గొన్నారు.

కోడుమూరు కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 9: కోడుమూరు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఎండ్లూరీ లాజరస్ దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారం విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆంధ్ర రత్న భవన్‌లో నియోజకవర్గం నాయకులతో కలిసి పార్టీ టికెట్ కోసం దరఖాస్తు సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పీసీసీ అధ్యక్షురాలు వైస్ షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ చైర్‌పర్సన్ సాకే శంకర్, డీసీసీ అధ్యక్షుడు కే.బాబురావు, నాయకులు రవిప్రకాష్, రవికుమార్ పాల్గొన్నారు.

వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలి

సి.బెళగల్, ఫిబ్రవరి 9: వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలని, లేకపోతే వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అనుపమ హెచ్చరించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశం భవనంలో ఎంపీడీవో శకుంతల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ అనుపమ మాట్లాడుతూ వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు సమయ పాలన పాటించడంలేదన్నారు. 11 గంటలైనా కూడా కార్యాలయాలకు రావడం లేదన్నారు. విధులకు సకాలంలో హాజరుకాని వారిపై జిల్లా ఉన్న తాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం ఎంపీడీవో శకుంతల మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు చూడాలన్నారు. ఈసమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనెనాయక్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మౌలిక వసతులను ఏర్పాటుపై నిర్లక్ష్యం వద్దు

సి.బెళగల్, ఫిబ్రవరి 9: పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతలను ఏర్పాటుపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో శేషిరెడ్డి బూత్ లెవల్ అధికారులను హెచ్చరించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో తహసీల్దార్ అనుపమ ఆధ్వర్యంలో బూత్‌లెవల్, సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీవో శేషిరెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు ఉండేలా చూడాలన్నారు. ఈసమావేశంలో ఎంపీడీవో శకుంతల, సెక్టోరియల్ అధికారులు, సూర్యప్రకాశ్, మాధవీలత, సుబ్బరాయుడు, ఎం ఈవో ఆదాంబాషా పాల్గొన్నారు.

పదేళ్ల బాలుడికి కిమ్స్‌లో చికిత్స

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 9: ఎమ్మిగనూరు ప్రాంతానికి చెందిన చరణ్ అనే పదేళ్ల బాలుడు కాళ్లు, ముఖం వాపు, అధిక రక్తపోటు, మూత్రంలో రక్తం వచ్చి ఇబ్బంది పడుతూ కర్నూలులోని కిమ్స్ ఆస్పత్రికి వచ్చారు. బాలుడికి నెఫ్రాలజిస్టు, ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ కె.అనంతరావు పరీక్షలు నిర్వహించగా.. ప్రోటీన్ పెద్దమొత్తంలో పోవడం రక్తంలో ఆల్బుమిన్ స్థాయి తగ్గిపోయి దీని వల్ల కాళ్ల వాపులు వచ్చినట్లు గుర్తించారు. బాలుడికి నెఫ్రి టిక్, నెఫ్రోటిక్ సిండ్రోమ్‌లు రెండు ఉన్నాయని కిడ్నీ బయాప్సీ నిర్వహిం చారు. దీంతోపాటు ఎలక్ట్రాన్ మైక్రోస్కోపి అనే ప్రత్యేక పరీక్ష చేశారు. అక్కడ బాలుడికి డెన్స్ డిపాజిట్ డిసీజ్ అనే జబ్బు ఉన్నట్లు గుర్తించి దీని కారణాలు తెలుసుకునేందుకు యాంటి ఫ్యాక్టర్ హెచ్.యాంటి బాడి స్థాయి సీఏఎన్‌ఈఎఫ్ స్థాయి, జన్యు పరీక్షలు చేయగా.. బాలుడికి జన్యులోపం ఉన్నట్లు తెలిసింది. ఆ తర్వాత బాలునికి ఇమ్యూనో సప్రెసెంట్లతో చికిత్స ప్రారంభించారు. దానికి బాలుడు త్వరగా స్పందించినట్లు నెఫ్రాలజిస్టు కె.అ నంతరావు తెలిపారు. ఇది ప్రతి లక్ష మంది పిల్లల్లో ఒక్కరికి వస్తుందన్నారు.

సీఎం క్యాంపు కార్యాలయ

ముట్టడిని జయప్రదం చేయండి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 9: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) అధ్వర్యంలో ఈ నెల 11న జరిగే సీఎం కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కారు మంచి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో లబ్ధి కోసమే కేవలం డీఎస్సీ 6,100 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి పరీక్ష గడువు కూడా ఇవ్వకుండా 20 రోజుల్లోనే పరీక్షలు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. ఈ నోటిఫికేషన్‌లో ఎస్‌జీటి, స్కూల్ అసిస్టెంట్ పోస్టులపైన స్పష్టత ఇవ్వకుండా డీఎస్సీ అభ్యర్థులను అయోమ యానికి గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈసమావేశంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, బీసన్న, శ్రీరాములు, నగర నాయకులు బాబయ్య, చంటి పాల్గొన్నారు.

21వ వార్డు ప్రజలను అవమానించారు

» గ్రావెల్ రోడ్డును తవ్వేయడం వైసీపీ నాయకుడి అవివేకం
» పక్కా రోడ్డు, కాల్వలు ఏర్పాటు చేయాలని టీడీపీ డిమాండ్



ఎఫ్‌సీఐ కాలనీ ఫేజ్-2లో తవ్విన రోడ్డును పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

కల్లూరు, ఫిబ్రవరి 9: కార్పొరేషన్ పరిధిలోని 21వ వార్డు వైసీపీ నాయకుడు ప్రజలను అవమానించేలా వ్యవహరించిన తీరు సరైంది కాదని టీడీపీ కల్లూరు అర్బన్ వార్డుల అధ్యక్షుడు, కర్నూలు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 21వ వార్డు కార్పొరేటర్ భర్త వైజా బాలచంద్రారెడ్డి ఎఫ్‌సీఐ కాలనీ ఫేజ్-2లోని భాస్కర్‌రెడ్డినగర్‌లో ఎక్స్‌కవేటర్‌తో గ్రావెల్ రోడ్డును తవ్విన ప్రాంతాన్ని శుక్రవారం టీడీపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా పెరుగు పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ వార్డు ప్రజలతో ఓట్లు వేయించుకుని గెలిచి సేవచేసేది పోయి గ్రావెల్‌రోడ్డు తవ్వడం వైసీపీ నాయకుల అవివేకానికి నిదర్శనమన్నారు. చేతనైతే కార్పొరేషన్ ఆధ్వర్యంలో రోడ్ల శాంక్షన్ చేయించి అభివృద్ధి పనులు చేయాలని అన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, వంగాల జనార్దన్‌రెడ్డి, రాఘవేంద్రారెడ్డి, రఘునాథ్‌రెడ్డి, బాబురాజు, విశ్వనాథ్ పాల్గొన్నా రు.

● **19వ వార్డులో హైపో ద్రావణం పిచికారి:** దోమల నివారణకు నగర పాలకసంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలని టీడీపీ వార్డు ఇన్‌చార్జి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్ డిమాండ్ చేశారు. గౌరుచరిత ఆదేశాల మేరకు 19వ వార్డులో దోమలపై దండయాత్రలో భాగంగా పవర్ స్ప్రేయర్‌తో హైపో ద్రావణం పిచికారి చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి పాల్గొన్నారు.

పింఛన్‌దారులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న చరణ్ కుమార్

గూడూరు, ఫిబ్రవరి 9: వితంతువు, వృద్ధాప్య, వికలాంగుల పించన్‌దా రులందరికీ న్యాయం చేయాలని కర్నూలు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం గూడూరులో ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో గత రెండు నెలల నుంచి కొత్తగా వితంతువు, వృద్ధాప్య, వికలాంగుల పింఛన్లను ఆన్‌లైన్ చేయడంలో జాప్యం జరుగుతుందని అన్నారు ఎన్నికల కోడ్ వచ్చేలోగా అధికారులు పింఛన్‌దారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రేవుల గోవిందు, చెట్టుకింది నారాయణ, సంఘాల మధు, రంగడు, నాగరాజు పాల్గొన్నారు.

అదనపు రవాణా చార్జీలు వసూలు చేయరాదు: జేసీ



కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 9: జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్, సిలిండర్లపై అదనపు రవాణా చార్జీ వసూలు చేసే వారిపై చర్యలు తీసుకుం టామని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీలను హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పౌరసరఫరాల శాఖ అధికారులతో వివిధ ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్లతో జేసీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనలకు వ్యతిరేకంగా గ్యాస్ లబ్ధిదారుల నుంచి అదనపు సొమ్ము వసూలు చేసే ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని, ఇంటింటికీ గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసే డెలివరి బాయ్స్‌పై గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఏజెన్సీలు తమ గోడౌన్ల నుంచి ప్రతి రోజు పంపిణీ చేసే గ్యాస్ సిలిండర్ల వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. గ్యాస్ కంపెనీల వారి నామ్స్ ప్రకారం గ్యాస్ గోడౌన్ నుంచి 5 కి.మీల పరిధిలో ఉన్న వినియోగదారులకు ఎలాంటి గ్యాస్ సిలిండర్ రవాణా రుసులు వసూలు చేయరాదని, గోడౌన్ నుంచి 5 కి.మీలు దాటి 15 కి.మీలు ఉన్న ట్లయితే సిలిండర్ రవాణా చార్జి కింద రూ.20, గోడౌన్ నుంచి 15 కి.మీ దాటి 30 కి.మీ ఉన్నట్లయితే రూ.30 అదనపు చార్జీలు బిల్లులోనే గ్యాస్ సిలిండర్ రవాణా చార్జీ కింద చూపించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కేవీఎస్ఎం ప్రసాద్, కర్నూలు సహాయ పౌరసరఫ రాల అధికారి రామాంజనేయరెడ్డి, గూడూరు సీఎస్‌డీటీ నవీన్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, జిల్లాలోని ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీలు పాల్గొన్నారు.

స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేయండి: రీసర్వే పూర్తయిన గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సబ్ కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికా రులు, తహసీల్దార్‌లతో జేసీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో జర్నలిస్టు హౌసింగ్‌కు సంబంధించి 368 దరఖాస్తులకు గాను 345 దరఖాస్తులను తనిఖీ చేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా తనిఖీ చేయాలని రెవెన్యూ డివిజన్ అధికారులను ఆదేశించారు. ఈసమావేశంలో ఆర్డీవోలు శేషిరెడ్డి, రామ లక్ష్మి, శివనారాయణశర్మ, తహసీల్దార్లు పాల్గొన్నారు.

నగర పాలక సంస్థకు రూ.1.09 కోట్లు

వేలంలో ఎగ్జిబిషన్‌ను దక్కించుకున్న సీకే.ప్రసాద్

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 9: నగర పాలక సంస్థ పరిధిలోని మున్సిపల్ ఎగ్జిబిషన్ గ్రౌండ్ లీజ్ ద్వారా కార్పొరేషన్‌కు రూ.1.09 కోట్ల ఆదాయం సమకూరింది. ఎగ్జిబిషన్ లీజు కోసం శుక్రవారం పాత కౌన్సిల్ హాలులో నిర్వహించిన బహిరంగ వేలంలో వివిధ ప్రాంతాలకు చెందిన ఆరుగురు ఏజెన్సీ, ట్రేడర్స్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. మార్చి, ఏప్రిల్, మే, నెలలకు సంబంధించి 90 రోజులకు వేలం నిర్వహించగా అందులో 75 రోజులకు మాత్రమే ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసుకుని రోజుకి రూ.1,46,000 చెల్లించే విధంగా నగరానికి చెందిన సీకే.ప్రసాద్ దక్కించుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, రెవెన్యూ ఆఫీసర్ జునైద్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు వాజిద్, సోహైల్, మన్సూర్, ఖలీల్ పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ వేలాన్ని రద్దు చేయాలి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న టీడీపీ కార్పొరేటర్లు, నాయకులు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 9: ఎగ్జిబిషన్ మైదానం వేలాన్ని తక్షణమే రద్దు చేయాలని తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్లు, నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 8వ వార్డు కార్పొరేటర్ కురువ పరమేష్ అధ్వర్యంలో కమిషనర్ భార్గవతేజకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా పరమేష్ మాట్లాడుతూ ఎన్నికలు ఒక్క నెల ఉండగా ఎగ్జిబిషన్‌ను నిర్వహించకూడదని, ఇప్పటికే కమిషనర్‌కు వినతి పత్రం అందజేశామన్నారు. అధికారులు అధికార పార్టీ నాయకులకు తొత్తులుగా మారి ఎన్నికల్లో ప్రజలను ప్రభావితం చేసేందుకే ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. కార్పొరేటర్లు జకియా అక్సారి, విజయకుమారి, క్రైప పద్మలతారెడ్డి, మాజీ కార్పొరేటర్లు పామన్న, బొల్లెద్దుల రామక్రిష్ణ, సుంకన్న పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

కర్నూలు, ఫిబ్రవరి 9: ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అన్నారు. 35వ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లా గ్రంథాలయంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. శాంతిరాం కంటి ఆసుపత్రి, మెడికవర్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జేసీతోపాటు రవాణా శాఖ ఉప కమిషనర్ శ్రీధర్, ఆర్టీవో రమేష్‌లు పాల్గొన్నారు. మదర్‌థెరిస్సా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి అద్దాలను పంపిణీ చేశారు. అనంతరం డీటీసీ మాట్లాడుతూ మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. ఆటోడ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ గంగాధర్ రెడ్డి, మదర్‌థెరిసా ట్రస్టు అధ్యక్షుడు దౌమణి, డాక్టర్లు మహబూబ్, రేష్మా, ఎంవీఐలు కిషోర్ పాల్గొన్నారు.

టీడీపీ కార్పొరేటర్లు అంటే లెక్కలేదా..

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 9: టీడీపీ కార్పొరేటర్లు అంటే లెక్కలేదా అని కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఎగ్జిబిషన్ మైదానానికి సంబంధించి జరుగుతున్న వేలం ప్రక్రియను రద్దు చేయాలని కోరుతూ వచ్చిన టీడీపీ కార్పొరేటర్లు కమిష నర్‌కు వినతి పత్రం ఇవ్వాలని వెళితే.. ఆయన ఆగ్రహంతో తాను కూర్చున్న కుర్చీని కాలితో తన్ని కార్పొరేటర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే నా చాంబరులో వచ్చి వినతిపత్రం ఇవ్వాలన్నారు. దీంతో కార్పొరేటర్లు ఆయన చాంబరులో వినతి పత్రం అందజేశారు.

ముగిసిన బాలోత్సవం



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న కేవీ సుబ్బారెడ్డి, డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 9: స్థానిక ఇండస్ పాఠశాలలో నిర్వహిస్తున్న బాలోత్సవం శుక్రవారంతో ముగిసింది. రెండో రోజు విద్యార్థులకు జానపద నృత్యం, దేశభక్తి గీతాలాపన, విచిత్ర వేషధారణ, ఏకపాత్రాభినయం లఘునాటిక పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మలు మాట్లాడుతూ డబ్బు పరమావధిగా పిల్లలను పెంచకుండా నిజమైన మనుషులుగా తయారు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రైవేటు విద్యాసంస్థల సంఘం సలహాదారులు పీబీవీ సుబ్బయ్య, మైత్రి హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ టి.వినోద్, రవీంద్ర విద్యాసంస్థల వైస్ చైర్మన్ జీ.వంశీధర్, బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జేఎన్ శేషయ్య, కల్చరల్ కార్యదర్శి కెంగార మోహన్, యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ నరసింహ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్, ఇండస్ పాఠశాల ప్రిన్సిపాల్ విల్సన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన స్టాండింగ్ కమిటీ సమావేశం

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 9: నగర పాలక సంస్థకు సంబంధించి స్టాండింగ్ కమిటీ సమావేశం శుక్రవారం ముగిసింది. మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి కమిషనర్ భార్గవ్‌తేజ, అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో 2023-24 సంబంధించి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అంతేగాకుండా పెద్దమార్కెట్ దగ్గర ఉన్న చేపల మార్కెట్, పార్కింగ్ స్థలం, పెద్ద మార్కెట్‌లో ఉన్న దుకాణాల సంబంధించి లీజు ప్రక్రియను ఆమోదించారు.

కార్పొరేటర్‌పై కేసు నమోదు

కర్నూలు, ఫిబ్రవరి 9: నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో 30వ వార్డు కార్పొరేటర్ జయరాం ఆయన సోదరులు కరుణాకర్, అభి మరికొందరిపై కేసు నమోదైంది. ఇదే కాలనీకి చెందిన ప్రభాస్ అలియాస్ గర్బి అనే వ్యక్తిపై గురువారం దాడి జరిగింది. ప్రభాస్ కత్తిపోట్లకు గురయ్యాడు. ఆ తర్వాత ఆసుపత్రిలో చికిత్స పొంది పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వీరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శంకరయ్య తెలిపారు.

నేడు 'జబర్దస్త్' కళాకారులతో కామెడీ షో

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 9: నగరంలోని టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 6 గంటలకు 'జబర్దస్త్' ఫేం కళాకారులతో కామెడీ షో ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా సినీనటుడు, 'థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ' ఫేమ్ కమెడియన్ నటుడు పృథ్వీ హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. జబర్దస్త్ ఫేం కళాకారులు మోహన్, నవీన్, జై రమేశ్, నాని, రజని, శ్రీకళ ఈ కామెడీ షోలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

అవయదాత పావనీలతకు నివాళి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 9: అవయదాత పావనీలతకు సీపీఐ నాయకులు నివాళి అర్పించారు. శుక్రవారం పావనీలత నివాసంలో జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గిడ్డయ్య మాట్లాడుతూ తాను చనిపోతూ నలుగురికి ప్రాణదానం చేసిన పావనీలత ఆదర్శనీయమన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ఎన్.రసూల్, సీనియర్ నాయకులు కే.జగన్నాథం, నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, సి.మహేష్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 9: బీహార్ రాష్ట్రంలోని పాట్నలో ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి జూనియర్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ పోటీలకు కర్నూలు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు పి.జోసెఫ్, డి.సాయి అమృత ఎంపికయ్యారు. కడపలో జరిగిన 10వ రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పి.జోసెఫ్ (మాంటిస్సోరి హైస్కూల్), డి.సాయి అమృత (శ్రీచైతన్య జూనియర్ కాలేజీ) క్రీడా నైపుణ్యాలను కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి కె.విజయకుమార్ తెలిపారు. శుక్రవారం విద్యానగర్‌లోని మాంటిస్సోరి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రిన్సిపాల్ స్వర్ణలత ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను అభినందించారు.

తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు పీవీ

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 9: తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు పీవీ నరసింహారావు అని బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్రమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో అత్యున్నత పురస్కారం 'భారతరత్న' దివంగత పీవీ నరసింహారావుకు ప్రకటించిన సందర్భంగా మిత్ర మండలి తరపున ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నంద్యాల నుంచి 1991 ఎంపీ ఎన్నికల్లో 6 లక్షలకు పైగా మెజార్టీ సాధించి, కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీ గా నెగ్గి, ప్రధాన మంత్రి పదవి చేపట్టిన తొలి తెలుగు తేజం పీవీ నరసింహా రావు అని కొనియాడారు.

● పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడం తెలుగు వారికి గర్వకారణమని లయన్స్ క్లబ్ జిల్లా అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో ఆర్థిక సంస్కర ణలు, అణు కార్యక్రమాలకు ఆయన పితామహుడని కొనియాడారు.

పీవీకి భారతరత్నపై హర్షం

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 9: దివంగత మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడంపై ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటరామరాజు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. యావత్ భారతదేశం గర్వించదగ్గ మహా నాయకుడు, బహుభాషా కోవిదుడు, భారత ఆర్థిక సంస్కరణ పితామహుడు పీవీ నరసింహారావు అని ఆయన కొనియాడారు.

కర్నూలు(రూరల్): మాజీ ప్రధానమంత్రి దివంగత పీవీ నరసింహారావుకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇవ్వడం హర్షణీయమని కోడుమూరు నియోజకవర్గ ఎంపీటీసీల సంక్షేమ సంఘం అధ్యక్షులు పసు పుల మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 భాషలు అనర్గళంగా మాట్లాడ కలిగిన మహోన్నత వ్యక్తి పీవీ అని కొనియాడారు. 1991లో జరిగిన నంద్యాల పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచి 5.80లక్షలు పైగా మెజార్టీ ఓట్లతో గెలిచి 1996 వరకు దేశప్రధానిగా సేవలు అందించారని ఆయన గుర్తుచేశారు. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రిగా కూడా పనిచేశారని వివరించారు.

నులిపురుగులను అశ్రద్ధ చేయొద్దు: డీఎంహెచ్‌వో



విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న డీఎంహెచ్‌వో

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 9: కడుపులో నులిపురుగులు ఉండడం వలన పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని డీఎంహెచ్‌వో డాక్టర్ రామగిడ్డయ్య అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సం దర్భంగా అనుగొండలో డీఎంహెచ్‌వో పాల్గొన్నారు. మధ్యాహ్న భోజన అనంతరం విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లలలో ఈ సమస్య తలెత్తుతుందన్నారు. మట్టిలో ఆడుకోవడం, గోళ్లు కత్తిరించకపోవడంతో నులిపురుగులు ఏర్పడి రక్తహీనత కలుగుతుందని అన్నారు. అలాగే గ్రామంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు కావ్య, జగదీష్, భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, ఫిబ్రవరి 9: నెలవారి విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు డివిజన్ ఆపరేషన్స్ ఈఈ చక్రపాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని ఏడీఈలు రాజేంద్రబాబు, రాజమోహన్‌రెడ్డి తెలిపారు. సెంట్రల్ సెక్షన్, బళ్ళారిరోడ్ సెక్షన్, పవర్‌హౌస్ సెక్షన్, సంతోష్‌నగర్ సెక్షన్, సీ.క్యాంప్ సెక్షన్, కల్లూరు ఇండస్ట్రియల్ సెక్షన్, ఓల్డ్‌టౌన్ ప్రాంతాల్లోని ఆయా కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

నిడ్జూరులో ఎన్ఎస్ఎస్ శిబిరం

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 9: నగరంలోని సెయింట్ జోసెఫ్స్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 వలంటీర్లు శుక్రవారం కర్నూలు మండలం నిడ్జూరు గ్రామంలో ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ప్రారంభించారు. మూడు రోజుల పాటూ కొనసాగే ఈ శిబిరంలో వలంటీర్లు గ్రామస్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తారని కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినే టర్లు డి. వెంకటేశ్వర్లు, ఎ.మల్లికార్జున, కమిటీ సభ్యురాలు స్వాతి కల్యాణి తెలిపారు. శిబిరంలో భాగంగా మొదటి రోజున విద్యార్థులు గ్రామంలో పరిశుభ్రతపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శిని కలిసి గ్రామంలో చేపట్టబోయే వివిధ అంశాలపై చర్చించారు.

ఉరుకుందలో ప్రత్యేక పూజలు



కౌతాళం, ఫిబ్రవరి 9: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో శుక్రవారం అమవాస్య సందర్భంగా స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. గురువారం రాత్రి నుంచే స్వామి సన్నిధిలో వేలాది మంది భక్తులు తరలివచ్చి జాగారణ చేపట్టారు. శుక్రవారం తెల్లవారుజామునే పవిత్ర స్నానాలు చేసి స్వామి దర్శనానికి క్యూలో నిల్చుకుని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పథకాలపై అవగాహన

ఆదోని టౌన్, ఫిబ్రవరి 9: బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే, బీజేపీ అన్య భాష రాష్ట్ర కన్వీనర్ ప్రకాశ్ జైన్ శుక్రవారం పెద్దతుంబలంలో వివరించారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు, రైతులకు, రైతు కూలీలకు అందిస్తున్న వివిధ పథకాలను గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దాసరి యువరాజు, మాజీ మండల అధ్యక్షుడు ఉపారాజ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు సర్పిరెడ్డి, దాసరి శ్రీనివాసులు, శంకరయ్య, హుసేని పాల్గొన్నారు.

త్రో బాల్ పోటీల్లో కాంస్య పతకం

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 9: ఆదోని జోనల్ క్రీడ పోటీల్లో మండలంలోని అరెకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. శుక్రవారం ప్రతిభ చాటిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి వీరస్వామి, ఎస్ఎంసీ చైర్మన్ నాగరాజు, వీరారెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగన్ మాట నిలుపుకోవాలి

ఆదోని టౌన్, ఫిబ్రవరి 9: ఎన్నికలకు ముందు సీఎం జగన్మోహన్ రెడ్డి చేపట్టిన పాదయాత్రలో వాల్మీకులకు ఇచ్చిన వాగ్దానాన్ని ఎన్నికల నోటిఫికేషన్ లోగా నిలుపుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యదర్శి డాక్టర్ పార్థసారథి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దేశంలోని వాల్మీకులు అందరూ ఎస్టీలుగా చలామణి అవుతుంటే, రాయలసీమలోని 40 లక్షల మంది వాల్మీకులను మాత్రమే బీసీలుగా గుర్తించడం ఎంతో దారుణమని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీలుగా పరిగణించాలన్న ప్రతిపాదనలు కేంద్రానికి పంపిస్తే అనుమతించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇదివరలో జగన్ ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలు తప్పులతడకగా ఉన్న కారణంగా కేంద్రం వెనక్కి పంపించిందని, అప్పటి నుంచి వాల్మీకుల సమస్యను పట్టించుకున్న దాఖలాలే లేవన్నారు.

పేదలకు నిత్యావసర సరుకులు

ఆదోని టౌన్, ఫిబ్రవరి 9: పెరిగిపోతున్న నిత్యావసర సరుకుల ధరలకు కళ్లెం వేస్తూ పేద, మధ్య తరగతికి చెందిన కుటుంబాలకు కేంద్రం సబ్సిడీతో అందిస్తోందని బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ నాగరాజు గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ భారత రైస్ పేరుతో రూ.29కే సామాన్యులకు సన్న బియ్యం అందిస్తోందన్నారు. కేంద్ర సంస్థ నాఫెడ్ ద్వారా గోధుమ పిండి, శనగ బ్యాళ్లు ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిందని, వచ్చే వారం నుండి సన్న బియ్యంతో పాటు ఇతర నిత్యావసరాలు కూడా అందించడం జరుగుతుందన్నారు.

సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం

ఆదోని, ఫిబ్రవరి 9: ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ నారాయణ్ శర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఎన్నికల విధులపై సెక్టోరల్ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలకు గాను 25 మంది సెక్టర్ ఆఫీసర్లు, ఇద్దరు రిజర్వ్ కలిపి 27 మంది సెక్టరల్ ఆఫీసరులను నియమించడం జరిగిందన్నారు. సెక్టోరల్ అధికారులు తమ పరిధిలోని ప్రతి పోలింగ్ స్టేషన్ సందర్శన చేయాలని, పోలింగ్ స్టేషన్లపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి వసతుల విషయమైన లోటుపాట్లు ఉంటే వెంటనే దృష్టికి తెచ్చి వసతుల కల్పన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు ఏఈఆర్ఓ హసీనా సుల్తానా, వీరభద్రప్ప, ఏజాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

దేవనకొండ, ఫిబ్రవరి 9: మెగా డీఎస్సీతో 25 వేల పోస్టులను విడుదల చేయాలంటూ 11 చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులను ముందు జాగ్రత్తగా దేవనకొండ సీఐ అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వం చెప్పిన మాట తప్పిందని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రామాంజినేయులు, ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మధు, భాస్కర్ అన్నారు.

పంట నష్ట పరిహారం ఇవ్వాలి

దేవనకొండ, ఫిబ్రవరి 9: ప్రభుత్వం పంటనష్ట పరిహారం వెంటనే రైతుల ఖాతాలకు జమ చేయాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సిద్ధం హంపిరెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏవో సురేష్‌బాబు అధ్యక్షతన సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో నష్టపోయిన పంటలకు పంటనష్ట పరిహారంతోపాటు ఇన్సూరెన్స్ కూడా మంజూరు చేయాలన్నారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని రూరల్, ఫిబ్రవరి 9 : దళిత గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవి కుమార్, సంఘం అడ్వైజర్ చంద్రయ్య, జై భీమ్ సాయిరామ్ తహసీల్దార్ హసినా సుల్తాన్‌ను కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను శుక్రవారం కలిసి వారు సన్మానించారు. కార్యక్రమంలో రాజు, మల్లేష్, ఎల్లప్ప, వీరేష్, రాము, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో తిక్కారెడ్డి



రాఘవరాయల బంగారు పల్లకిని మోసిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి

మంత్రాలయం, ఫిబ్రవరి 9: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి మంత్రాలయం వచ్చారు. శుక్రవారం ఆలయ ముఖ ద్వారం వద్ద జోనల్ మేనేజర్ శ్రీపతాచార్, వ్యాసరాజాచార్ స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. రాఘవరాయుని బంగారు పల్లకిని భుజాలపై పెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పన్నగ వెంకటేష్, తెలుగు రైతు జిల్లా కార్యదర్శులు బూదూరు మల్లికార్జున రెడ్డి, ఎల్లారెడ్డి, విజయరామిరెడ్డి, అశోక్ రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, వగరూరు అబ్దుల్లా, దస్తగిరి, గోపాల్, చావిడి వెంకటేశ్ పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి

కౌతాళం, ఫిబ్రవరి 9: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమని టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి అన్నారు. ఉరుకుందలో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో తిక్కారెడ్డి పాల్గొన్నారు. అంతకు ముందు ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం గ్రామంలో 6 పథకాలను ప్రతి గడపకు వెళ్లి గ్యారెంటీ బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, టీడీపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శులు వెంకటపతిరాజు, నాయకులు కోట్రేష్‌గౌడ్, కురుగోడు, రంగస్వామి, నాగేంద్ర, రాజానందు, ఎరిగేరి బసవరాజు, చిరుతాపల్లి శివప్పగౌడ్, మల్లయ్య ఉన్నారు.

వైసీపీకి పతనం తప్పదు

● పత్తికొండ టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు

తుగ్గలి: అరాచక పాలన సాగిస్తున్న వైసీపీకి పతనం తప్పదని టీడీపీ పత్తికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని జొన్నగిరిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తుందని వైసీపీ పీడ వదలాలంటే వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబుదామని పిలుపునిచ్చారు. గత ఐదేళ్లలో నియోజకవర్గంలో మద్యం, జూదం తప్ప మరే ఏ అభివృద్ధి జరగలేదన్నారు. గ్రామాల్లో అభివృద్ధి కుంటు పడిందని, సాగు, తాగునీరు అందక ప్రజలు అల్లాడుతున్నారని టీడీపీ ప్రభుత్వంతో ప్రజలకు, రైతులకు, మహిళలకు అన్ని సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు, బాలన్న, తిరుపాల్ నాయుడు, లక్ష్మణస్వామి, రవియాదవ్, గురుస్వామి, సంగాల కృష్ణ, సర్పంచు ఓబులేసు, బలరాముడు, వెంకట్రాముడు చౌదరి, డీలర్ సుంకన్న, మీసాల శేఖర్, గుండమయ్య, మల్లయ్య పాల్గొన్నారు.



జొన్నగిరిలో టీడీపీ పథకాలను వివరిస్తున్న కేఈ శ్యాంబాబు

చంద్రబాబుతోనే యువతకు భవిష్యత్

గోనెగండ్ల : రాష్ట్రంలో యువతకు భవిష్యత్ చంద్రబాబుతోనే అని తెలుగుయువత మండల అధ్యక్షుడు రంగస్వామినాయుడు, మాల్లా బాషా, జయపాల్, లక్ష్మీకాంతస్వామి, పోల్‌కల్ వెంకటేశ్వర్లు, హరికృష్ణ, అబుబకర్ అన్నారు. శుక్రవారం మైఫస్ట్ ఓట్‌ఫర్ సీబీఎన్ అనే కార్యక్రమాన్ని విజ్ఞాన్ కళాశాలలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఓటర్ జాబితాలో కొత్తగా ఓటర్ నమోదు చేసుకున్న యువకులు, విద్యార్థులకు వైసీపీ ప్రభుత్వ చేస్తున్న అరాచకాలు, విద్యార్థులకు చేస్తున్న అన్యాయాన్ని వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఐరన్‌బండ బాషా, మునిస్వామి, వినోద్, గోవర్ధన్‌నాయుడు, రామకృష్ణ, నీలకంఠ, దస్తగిరి, సూర్యనారాయణరెడ్డి, గిడ్డయ్య, శ్రీకాంత్, కాజా, అనూక్, వలి పాల్గొన్నారు.



గోనెగండ్లలో మాట్లాడుతున్న తెలుగు యువత నాయకులు

వైసీపీ ప్రభుత్వం దిగిపోవడానికి సిద్ధం

ఆదోని: వైసీపీ ప్రభుత్వం దిగిపోవడానికి సిద్ధమైందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మాన్వి దేవేంద్రప్ప అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడి ఐదు సంవత్సరాల పూర్తవుతున్న తరుణంలో ఇచ్చిన హామీలు పూర్తిగా నెరవేర్చలేకపోయారన్నారు. వైసీపీ అసమర్థ పాలనతో అప్పులు పెరిగి ప్రజలపై బారం మోపి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. సీఎం జగన్, వైసీపీ నాయకులు ఎన్నికలకు సిద్ధమని చెబుతున్నారని, వైసీపీని ఓడించేందుకు ప్రజలు కూడ సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రాన్ని నాశనం చేసిన అరాచక ప్రభుత్వాన్ని ఇంటికి పంపడం ఖాయమన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం సూపర్ 6 పథకాలు ప్రకటించారన్నారు. కార్యక్రమంలో నాయకులు సోమశేఖర్ రెడ్డి, రామకృష్ణ అంజి గోవిందు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాన్వి దేవేంద్రప్ప

బోగస్ ఓట్లను తొలగించాలి



తహసీల్దార్ రజాక్‌వలితో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మద్దికెర, ఫిబ్రవరి 9: మండలంలో ఓటరు జాబితాలో బోగస్ ఓట్లను తొలగించాలని మాజీ జడ్పీటీసీ సభ్యులు జమేదార్ రాజన్న యాదవ్, జిల్లా టీడీపీ కార్యవర్గ సభ్యులు ఎల్. లక్ష్మీనారాయణ, ఉప్పర రంగయ్య, తాలుకా తెలుగు యువత అధ్యక్షులు ఈడిగ చంద్రశేఖర్ గౌడు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ రజాక్‌వలితో మాట్లాడుతూ మండలంలోని మొత్తం 11 గ్రామాల్లో 29వేల ఓట్లలో దాదాపు వేయికి పైగా బోగస్ ఓట్లు ఉన్నాయన్నారు. పార్టీలకతీతంగా ఆ ఓట్లను తొలగించాలని కోరారు. తహసీల్దార్ రజాక్‌వలి మాట్లాడుతూ చనిపోయిన వారి పేర్లు, గ్రామం వదిలి వెళ్లినవారు, వివాహం చేసుకుని వారి పేర్లను మాకు అందించాలని, వారి ఓట్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమస్యలు పరిష్కారంకాని సమావేశాలు ఎందుకు?



నిరసన తెలుపుతున్న టీడీపీ ఎంపీటీసీలు, సర్పంచులు

ఆస్పరి, ఫిబ్రవరి 9: సమస్యలు పరిష్కారం కానీ మండల సమావేశాలు ఎందుకు నిర్వహిస్తారని ఎంపీటీసీలు, సర్పంచులు అన్నారు. శుక్రవారం ఎంపీపీ సుంకర ఉమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని తంగారడోన, అలిగేర, ములుగుందం, బనవనూరు, తుగలగల్లు గ్రామ ఎంపీటీసీలు, సర్పంచులు నరస్పప్ప, రహీం తుల్లా, ప్రభావతమ్మ, బొబ్బిలి వీణ, అంజనేయ, శ్యామల తమ ప్రత్యేక వాణిని వినిపించారు. ఆస్పరి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినా ఇంతవరకు ప్రభుత్వం సహాయకచర్యలు చేపట్టలేదని టీడీపీ ఎంపీటీసీలు ధ్వజమెత్తారు. మండలంలోని 33 గ్రామాలలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని, ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతులు నష్టపోయారని, కనీసం పంటనష్టపరిహారం కూడా మంజూరు చేయలేదని ఆరోపించారు. అనంతరం ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఎంపీటీసీల నిరసన కార్యక్రమానికి టీడీపీ సీనియర్ నాయకులు ఎస్ తిమ్మన్న, హనుమంత రెడ్డి, రవి మద్దతు పలికారు.

విధులకు వెళ్లిన భర్త తిరిగి రాలేదని మహిళ ఫిర్యాదు

పత్తికొండ, ఫిబ్రవరి 9 : కోడుమూరులో బ్యాంకు విధులకు వెళ్లిన తన భర్త చంద్రన్న ఇంటికి తిరిగి రాలేదంటూ భార్య కురువలక్ష్మి శుక్రవారం పత్తికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దేవనకొండ మండలం బండగట్టు తన భర్త స్వగ్రామం కాగా తన పుట్టినిల్లు అయిన పత్తికొండ మండలం కొత్తపల్లికి వచ్చామన్నారు. ఈనెల 8వ తేదీ తెల్లవారు జామున 5గంటలకు చంద్రన్న కోడుమూరులో బ్యాంకు విధి నిర్వహణకు కొత్తపల్లి నుంచి బయలుదేరి వెళ్లి ఇంటికి తిరిగిరాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా కురువ చంద్రన్నకు స్వగ్రామంలో రూ. 5 కోట్ల మేరకు అప్పులు ఉన్నట్లు సమాచారం. కురువలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ మురళీమోహన్ తెలిపారు.

ఎన్నికల కేంద్రాల్లో సమస్యలపై దృష్టి పెట్టండి

మంత్రాలయం, ఫిబ్రవరి 9: మంత్రాలయం మండలంలో ఎన్నికల కేంద్రాలపై దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీధర్ మూర్తి అన్నారు. శుక్రవారం చిలకలడోణ గ్రామంలో 78,80,81 పోలింగ్ బూతులను తనిఖీ చేశారు. తనిఖీలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శశిశేఖర్ రావు, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

తుగ్గలి, ఫిబ్రవరి 9: డీలర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలని మండల డీలర్ సంఘం నాయకులు చంద్రశేఖర్, తిమ్మప్ప, సుంకన్నలు కోరారు. శుక్రవారం మండల కేంద్రమైన తుగ్గలి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ షర్మిళను మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి సన్మానం చేశారు. డీలర్లు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీలర్ సంఘం నాయకులు గౌరప్ప, డీలర్ రవి తదితరులు ఉన్నారు.

అమ్మవారికి బంగారు వడ్డాణం

కోసిగి, ఫిబ్రవరి 9: కోసిగిలోని 4వ వార్డులో వెలసిన మారెమ్మ అమ్మవారికి టీడీపీ మాజీ ఎంపీపీ లక్ష్మిరెడ్డి సతీమణి మాజీ ఎంపీపీ పల్లెపాడు శకుంతలమ్మ, కుమారుడు నాగిరెడ్డి శుక్రవారం మారెమ్మ అమ్మవారికి 5 తులాల బంగారు వడ్డాణం, బంగారు ఆభరణాలను ఆలయ అర్చకులు శ్రీనవాసులు, అలయ గ్రామ పెద్దలు శనిగేని ఉశేనీలకు వారు అందజేశారు. ముందుగా మారెమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు.

నిరుద్యోగులను మోసం చేసిన వైసీపీ



తుగ్గలిలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న టీడీపీ తెలుగు యువత నాయకులు

తుగ్గలి, ఫిబ్రవరి 9: నిరుద్యోగులను వైసీపీ ప్రభుత్వం మోసం చేస్తుందని టీడీపీ తెలుగు యువత మండల అధ్యక్షులు సత్యప్రకాష్, తిరుపాల్ నాయుడు, చంద్రశేఖర్ యాదవ్ అన్నారు. శుక్రవారం తుగ్గలిలో చాలీచాలని పోస్టులను వదిలారంటూ యువత ప్రధాన బస్టాండు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో ఒక్క ఉపాధ్యాయ పోస్టు కూడా భర్తీ చేయకుండా కేవలం ఎన్నికల కోసం 6వేల పోస్టులకు డీఎస్సీ వదలడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో 50వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. ఈ దగా డీఎస్సీ మాకు వద్దని, మెగా డీఎస్సీ విడుదల చేయాలని, లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, మైరాముడు, మోహన్, నల్లగుండ్ల రవి, గిరిగిట్ల మల్లి, సోమశేఖర్ గౌడు, డీలర్ సుంకన్న పాల్గొన్నారు.

కన్నడ భాషాభివృద్ధికి కృషి చేయాలి

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 9: కన్నడ భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కల్లుమఠం పీఠాధిపతి గురుసిద్ధ లింగస్వామి అన్నారు. శుక్రవారం కన్నడ భాషాభివృద్ధి సాధికార సంస్థ ఆధ్వర్యంలో కర్నూలు, అనంతపురం జిల్లాలలో ప్రభుత్వ కన్నడ పాఠశాలలో 10వ తరగతి 2021-22 బ్యాచ్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందించారు. ఆయన మాట్లాడుతూ ఆదోని డివిజన్లో అత్యధికంగా కన్నడిగిలు ఉన్నారన్నారు. గతంలో ఉన్న కన్నడ పాఠశాలలు, టీచర్ పోస్టులు భర్తీ కాకపోవడంతో మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడి ప్రభుత్వం కన్నడ పుస్తకాలను కూడా ముద్రించకుండా కేవలం అరకొర పుస్తకాలతోనే చదువులు కొనసాగిస్తున్నారన్నారు. సీబీఎస్ఈ ద్వారా కన్నడ భాష కనుమరుగయ్యే ప్రమాదం ఉందని అన్నారు. కన్నడ ప్రజావాణి సంపాదకులు రవీంద్ర భట్టు మాట్లాడుతూ కన్నడ భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిలో ఉందని తెలిపారు. అనంతరం వారికి ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మపర్సన్ శాంత, కన్నడ భాషాభివృద్ధి డివిజన్ అధ్యక్షుడు శరణప్ప, దేశాయి చందన్న, కృష్ణమూర్తి గౌడ్, రామలింగప్ప, డాక్టర్ సంతోష్ ఆనర్ పాల్గొన్నారు.



ప్రతిభ పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో పీఠాధిపతులు

తుంగభద్ర శ్రీమఠానికి వాదిరాజ్ మఠం పీఠాధిపతి



వాధిరాజమఠం పీఠాధిపతికి స్వాగతం పలుకుతున్న మంత్రాలయం పీఠాధిపతి

మంత్రాలయం, ఫిబ్రవరి 9: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం బ్రాంచ్ అయిన తుంగభద్ర మఠంకు కర్ణాటకలోని సోధే వాధిరాజ మఠం పీఠాధిపతి విశ్వవల్లభతీర్థులు వచ్చారు. శుక్రవారం స్వామీజికి పరిమళ పెట్రోలియం నిర్వాహకులు రంగనాథరాజు, మేనేజర్ పురిడి నాగేషాచార్, వాది సింహాచార్, పణీంద్రాచార్ జోషి, బీకే రాఘవేంద్రాచార్, జీకే ప్రకాష్, రామాచార్ జోషి, సందీప్ స్వాగతం పలికారు. రాఘవేంద్రస్వామి బృందావనం దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఫలపుష్ప పట్టువస్త్రంతో పీఠాధిపతులను సన్మానించారు. మంత్రాలయం పీఠాధిపతి వాధిరాజమఠం పీఠాధిపతికి వారి మఠం శిలా మండపానికి రూ.5 లక్షలు విరాళంగా అందజేశారు. ఇరువురి పీఠాధిపతులు రథోత్సవ ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాస రావు, వెంకటేష్ జోషి, శ్రీపతాచార్, ద్వారపాలక అనంతస్వామి, ఐపీ నరసింహమూర్తి, ప్రకాషాచార్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 9: దివ్యాంగులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని ఫెయిత్ హోమ్ వ్యవస్థాపకులు రెవరెండ్ పాస్టర్ డేనియల్ ప్రేమ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఫెయిత్ హోమ్‌లో ఆపరేషన్ ఎక్విప్ ఇండియా సహకారంతో ఒక్కరోజు దివ్యాంగులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ డివిజన్ ఆఫీసర్ జోనాథపఖ పాల్గొన్నారు.

భాతరత్న ఇవ్వడం హర్షణీయం

ఆదోని, ఫిబ్రవరి 9: పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వడం పట్ల హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెల్లాల మధుసూదన శర్మ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ భారతదేశ అభివృద్ధిలో పీవీ నరసింహారావు పాత్ర చాలా కీలకమైనదని అన్నారు. భారతరత్న అవార్డు ప్రదానం చేసిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి యావత్ బ్రాహ్మణ జాతి తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ వేలంపాట వాయిదా

ఎమ్మిగనూరు , ఫిబ్రవరి 9: ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కబేళాలు, వారపు సంతమార్కెట్, పశువుల మార్కెట్, రోజు వారి మార్కెట్, మాంసం మార్కెట్, గొర్రెలలకు జరిగే వేలం పాటలు వాయిదా పడినట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. శుక్రవారం జరగాల్సిన వేలం పాటకు వేలం పాటాదారులు ఎవరూ పాల్గొనకపోవడంతో వేలం పాటను 13.02.2024కు వాయిదా వేశామన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వేలం పాటా దారులు 13వ తేదీ వేలంపాటలో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

గ్రామంలోని ప్రజలు కలసిమెలసి ఉండాలి

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 9: గ్రామంలోని ప్రజలు ఒకరికొకరు కలసిమెలసి ఉండాలని రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామంలో పొద్దుపోయాక గ్రామ సభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు ఎలాంటి గొడవలు, ఘర్షణలకు పాల్పడరాదన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 9: ఎమ్మిగనూరు మండల పరిధిలోని చెన్నాపురం క్రాస్‌రోడ్డు సమీపంలో ఎమ్మిగనూరుకు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దేవిబెట్ట గ్రామానికి చెందిన లక్ష్మీరెడ్డి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండడంతో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న రామకృష్ణ

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 9: కర్నూలు జిల్లాలో కరువు సహాయక చర్యలు తక్షణమే చేపట్టాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం రంగారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల వల్ల ఏర్పడిన కరువు కాటకాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిందని, అయితే.. ఇంత వరకు ఎలాంటి కరువు సహాయక చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు హనుమంతు, సహాయ కార్యదర్శి సూరి, విజయగౌడు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలి



మాట్లాడుతున్న షాబీర్ బాషా


పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 9: కేంద్రం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్‌బాషా డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆల్తాఫ్ అధ్యక్షతన నిర్వహించారు. షాబీర్ బాషా మాట్లాడుతూ విద్యారంగంలో మార్పులు తీసుకువస్తామని కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని కాషాయీకరణ చేయడానికి కుట్రలు పన్నుతోందన్నారు. నూతన జాతీయ విద్యావిధానం పేరుతో పాఠ్యాంశాల్లో మతభావాజాలాలను ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు. నూతనజాతీయ విద్యావిదానం రద్దు చేసే వరకు పోరాటాలు సాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వినోద్, రమేష్, పవన్, మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 9: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని ఆశావర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు లింగమ్మ, కృష్ణవేని, సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు అన్నారు. శుక్రవారం ఆశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమప్ప సర్కిల్‌లో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నరసమ్మ, రేష్మా, షబానా, గంగమ్మ, మహాలక్ష్మి, కేశమ్మ, రాణి, జయమ్మ, నాగలక్ష్మి, వీరేషమ్మ, రంగలక్ష్మి, తేజశ్విని, విజయలక్ష్మి, అన్వేశ్వరి, సరస్వతి పాల్గొన్నారు.

గోనెగండ్ల: విజయవాడలో శాంతి యుతంగా తమ నిరసనను తెలిపేందుకు వెళ్తుతున్న ఆశా వర్కర్లను అప్రజాస్వామ్యకంగా అరెస్టు చేయడం అనాగరిక చర్య అని ఆశా వర్కర్ల(సీఐటీయూ) సంఘం జిల్లా అధ్యక్షురాలు శివలక్ష్మి అన్నారు. గోనెగండ్లలో శుక్రవారం ఆశావర్కర్లతో కలసి ఆమె ఎమ్మిగనూరు, కర్నూలు ప్రధాన రహదారిపై ధర్నా చేశారు.

ఆలూరు: కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అడిగితే అరెస్టులు చేస్తారా..? అంటూ సీఐటీయూ నాయకులు నారాయణ స్వామి, ఆశావర్కర్ల యూనియన్ నాయకులు భారతి, జరీనా అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆశావర్కర్లను అరెస్టులకు నిరసనలో పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

కోసిగి: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్న ఆశా వర్కర్లను అక్రమంగా పోలీసులు అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం మండలంలో ఆశా వర్కర్ల యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో బీరప్పస్వామి దేవాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి వైఎస్సార్ సర్కిల్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆశా వర్కర్లు రాస్తారోకో నిర్వహించారు.

పత్తికొండ టౌన్: న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరితే.. అక్రమ అరెస్టులు చేస్తారా అంటూ సీఐటీయూ నాయకులు వెంకటేశ్వర రెడ్డి, గోపాల్, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు అనిత ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక ఈశ్వర్‌రెడ్డి భవన్ నుంచి ఆశా వర్కర్లు పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహిస్తూ నాలుగు స్తంభాల కూడలికి చేరుకుని అక్కడ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వారు వినతి పత్రం సమర్పించారు.

ఆదోని: ఆదోని పట్టణం పరిధిలో శ్రీనివాస్ భవన్ కూడలిలో ఆశ వర్కర్ల అక్రమ అరెస్ట్ నిరసనగా శుక్రవారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరన్న, వీరారెడ్డి, మల్లికార్జునలు మాట్లాడారు. ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని 8వ తేదీన ఆశావర్కర్ల తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని అడ్డుకుంటూ, పలువురిని, గృహ నిర్బంధంలో ఉంచడం, రైల్వే స్టేషన్లో అక్రమ అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు.

మంత్రాలయం: ఆశా వర్కర్లు న్యాయమైన సమస్యల పరిష్కరించేంత వరకు పోరాటాలు చేస్తామని సీఐటీయు మండల కార్యదర్శి జయరాజు, ఆశా వర్కర్ల అధ్యక్షురాలు రాధ, కార్యదర్శి పుష్పవతిలు అన్నారు. శుక్రవారం మంత్రాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి రాఘవేంద్ర సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడి నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ధర్నా నిర్వహించారు.